www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

మంగళవారం, 28.05.2024, హైదరాబాద్ | సంపుటి: 2, సంచిక: 227




# అడుగడుగునా నిఘా

స్వపక్షం, విపక్షం అనే తేడా లేదు ■ మీడియా యజమానులు, విపక్ష నేతల భార్యలపై కూడా.. ■ బీఎల్ సంతోష్ ను అరెస్ట్ చేసి కవితను తప్పించే ప్లాన్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజురోజుకో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అప్రూవర్ గా మారిన మాజీ డీసీపీ రాధాకిషన్ రావు వాంగ్మూలంలో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి ఇబ్బందిగా మారిన వ్యక్తుల ఫోన్ల పై నిఘా పెట్టినట్లు ఈ కేసులో నిందితుడిగా ఉన్న రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో ఒప్పుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మీడియా యజమానులకు కూడా వదల్లేదని తెలిపారు. కీలక ఛానళ్ల యజమానుల ఫోన్లు సైతం ట్యాప్ చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని ట్రోలింగ్ చేసిన వారిని టార్గెట్ చేసినట్లు ఇదివరకే ప్రణీత్ రావు తెలిపాడు.

### వివాదాలపై కన్నేసి, ఫోన్లపై నిఘా పెంచి..

అప్పటి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేతో వివాదాలున్న శంబీపూర్ రాజుపై, కడియం శ్రీహరితో ఉన్న రాజయ్య విభేదాలపై నిఘా పెట్టామని తెలిపాడు. తాండూరు ఎమ్మెల్యేతో పట్నం మహేందర్‌రెడ్డి దంపతులకు ఉన్న విభేదాలపైనా ఓ కన్నేసి ఉంచినట్లు రాధాకిషన్ రావు వెల్లడించారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపైనా నిఘా పెట్టామన్నారు. అప్పటి బీఎస్పీ నేత ప్రవీణ్‌కుమార్, తీగల కృష్ణారెడ్డి, తీన్మార్ మల్లన్న ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు ఒప్పుకున్నారు. వారితో పాటు కాంగ్రెస్ నేత జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి, సరిత తిరుపతయ్యపై నిఘా పెట్టామన్నారు. జువ్వాడి నర్సింగరావు, వంశీకృష్ణ, కవ్వంపల్లి సత్యనారాయణతోపాటు ఈటల రాజేందర్, బండి సంజయ్, ఎంపీ అరవింద్ ఫాలోవర్ల ఫోన్లపై నిఘా పెట్టినట్లు రాధాకిషన్ పేర్కొన్నాడు. కొందరు మీడియా యజమానుల వాట్సప్, స్నాప్‌చాట్‌లో మాట్లాడిన వారి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఇంటర్నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డులను ప్రణీత్‌రావు విశ్లేషించారని రాధాకిషన్‌రావు అంగీకరించారు.

### కవితను లిక్కర్ కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు

అంతే కాకుండా బీఎల్ సంతోష్ ని కనుక అరెస్ట్ చేస్తే తన కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను లిక్కర్ కేసు నుంచి తప్పించవచ్చు అని అప్పటి సీఎం కేసీఆర్ భావించారని రాధాకిషన్ రావు వాంగ్మూలంలో పేర్కొన్నారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. పార్టీని వదిలి బీజేపీలోకి చేరనున్నట్లు కేసీఆర్ కు సమాచారం రావడంతో వారిపై నిఘా పెట్టాలని ఐబీ చీఫ్ కు కేసీఆర్ ఆదేశాలు జారీ చేసినట్లుగా చెప్పారు. డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ చేసి వాటిలో కొన్ని ఆడియోలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఇచ్చారని.. ట్యాపింగ్ క్లిప్ లు చేతికి అందిన తర్వాత ఫాంహౌస్ ట్రాప్ కోసం ఢిల్లీ నుంచి ఖరీదైన స్పై కెమెరాలు, మెటీరియల్ తెప్పించినట్లు తన వాంగ్మూలంలో తెలిపారు.

# బిభవ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

❑ ఎంపీ స్వాతి కన్నీళ్లు ❑ ఢిల్లీ కోర్టులో హైడ్రామా
❑ బిభవ్ కుమారుడిని విడుదల చేస్తే నా ప్రాణాలకు ముప్పు
❑ ఎంపీ స్వాతి మాలీవాల్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మాలీవాల్‌పై దాడి కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌ను సోమవారం ఢిల్లీ కోర్టు కొట్టివేసింది. ఇరు పక్షాల వాదనలు విన్న మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గౌరవ్ గోయల్ తిరస్కరించారు. బిభవ్ కుమార్ జైల్లో ఉన్నా కూడా స్వాతికి మిగతా 2లో

# మోడీ ప్రధాని అవ్వడం అంత ఈజీ కాదు

○ ఆయన నిజమైన దేశభక్తుడేనా?
○ అయితే అగ్నిపథ్ పథకంతో జవాన్లను ఎందుకు అవమానించారు
○ కూటమికి పెరుగుతున్న ఆదరణ
○ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

కేంద్రంలోని మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. తనను తాను నిజమైన దేశభక్తుడిగా ప్రకటించుకుంటున్న ప్రధాని మోడీ అగ్నిపథ్ పథకంతో జవాన్లను అవమానించారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బిహార్‌లోని పాలిగంజ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్.. కేంద్రంలోని బీజేపీపై విరుచుకుపడ్డారు. దేశం కోసం భగవంతుడు తనను ఇక్కడికి పంపించాడని ప్రధాని మోడీ వ్యాఖ్యానించడంపై రాహుల్ మండిపడ్డారు. ''సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారు. తానొక నిజమైన దేశభక్తుడిని అంటూ మోదీ ప్రజలను నమ్మిస్తున్నారు. కానీ, అగ్నివీర్ పథకాన్ని అమలుచేసి సైనికులను ఘోరంగా అవమానించారు. ఆయన మళ్లీ ప్రధాని కావడం కష్టమే. ఇది రాహుల్ గ్యారంటీ. రాజ్యాంగ మార్పుకు కాషాయ పార్టీ పన్నుతున్న కుట్రను అడ్డుకుంటాం'' అని రాహుల్ దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా తమ కూటమికి ప్రజాదరణ లభిస్తోందని.. ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని రాహుల్ ధీమా వ్యక్తంచేశారు. ''ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్నిపథ్ మిగతా 2లో

# ఈనెల 31వ తేదీన విచారణకు హాజరైతా

## ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

లైంగిక దౌర్జన్యాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఎట్టకేలకు స్పందించారు. ఈ నెల 31వ తేదీన విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ ఇండియా టుడేకు తెలిపినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. ఏప్రిల్ 26న జరిగిన కర్ణాటక మిగతా 2లో



# శరవేగంగా మేడిగడ్డ మరమ్మతులు

■ కొనసాగుతున్న గేట్ల కటింగ్ పనులు
■ బుంగ, నీటి ఊటలను ఇసుకతో నియంత్రణ

వివరాలు 3లో

# ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

▪ మధ్యాహ్నం 2 గంటల వరకు 49.3 శాతం పోలింగ్
▪ పలు చోట్ల ఉద్రిక్తత ▪ డబ్బులు పంచుతున్నారంటూ ఇరు వర్గాల ఘర్షణ

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలోని ఖమ్మంనల్గొండవరంగల్ ఉమ్మడి జిల్లాల్లో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఉపఎన్నికలో మొత్తం 49 మంది పోటీలో ఉండగా కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న, భారాస అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి, భాజపా నేత ప్రేమేందర్ ప్రధానంగా బరిలో నిలిచారు. ఈ ఎన్నికలో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 4,63,839 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు 49.53 పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద డబ్బులు పంచుతున్నారంటూ ఇరు వర్గాల ఘర్షణకు దిగాయి. ప్రాధాన్యత ఓటు పద్ధతి అయినందున ఈవీఎంలను వినియోగించే అవకాశం లేకపోవడంతో బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరిగింది. ఓటర్లు పోలింగ్ కేంద్రంలో అధికారులు ఇచ్చిన వైలెట్ రంగు పెన్నుతో ప్రాధాన్యతను టిక్ చేశారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఎడమచేతి చూపుడువేలుకు సిరా చుక్క పెట్టినందువల్ల ఈ ఎన్నికల్లో ఎడమచేయి మిగతా 2లో







# పదేళ్లలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారు

■ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు ■ బీజేపీకి జగ్గారెడ్డి సూటి ప్రశ్న
■ బీజేపీలో పదవులు అడిగితే ఉన్న పదవి పోతుంది



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీ దేశాభివృద్ధికి దోహదం చేసే పరిశ్రమలు పెడుతూ వస్తే, బీజేపీ వాటిని అమ్ముకుంటూ వస్తోందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న ఈ పదేళ్లలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారని ప్రశ్నించారు. ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నంత స్వేచ్ఛ మరే పార్టీలో ఉండదని అన్నారు. బీజేపీలో మిగతా 2లో

# మేం 38 లక్షల కోట్లు పేదలకు పంచాం

■ కాంగ్రెస్ పవర్ లో ఉంటే ఇందులో 25 లక్షల కోట్లు బొక్కేవారు
■ కాంగ్రెస్ లీడర్లకు పాక్ సపోర్ట్ ఎందుకు? ■ ఈ విషయం తేలాలి
■ అవినీతి పరులను వదిలిపెట్టం ■ ప్రధాని నరేంద్రమోడీ



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత కేజ్రీవాల్‌లకు పాకిస్తాన్ నుంచి మద్దతు లభిస్తోందని ప్రధాని మోడీ కొద్ది రోజులుగా ఎన్నికల ప్రచారసభల్లో చెబుతున్నారు. వారు గెలవాలని పాకిస్థాన్ కోరుకుంటోందన్నారు. ఇదే విషయాన్ని ఇయాన్స్ కు ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ కూడా ధృవీకరించారు. భారత్ లోని వ్యక్తులకు పాకిస్థాన్ నుంచి మద్దతు ఎందుకు వస్తుందో తెలియాల్సి ఉందన్నారు. ఇది విచారణ ద్వారా తేలుతుందని వ్యాఖ్యానించారు.

### అవినీతిని అంతం చేశాం!

బీజేపీ పాలనలో అవినీతి అనేదే లేదని ప్రధాని మోడీ అన్నారు. దానికి గతంలో రాజీవ్ గాంధీ చేసిన వ్యాఖ్యలతో ముడిపెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ప్రభుత్వం పేదల కోసం రూపాయి ఖర్చు పెడితే పేదలకు పది పైసలు మాత్రమే చేరుతుందని ..అవినీతి ఆ స్థాయిలో ఉందని చెప్పారు. అదే విషయాన్ని పరోక్షంగా గుర్తు చేసిన ప్రధాని మోదీ బీజేపీ ప్రభుత్వం పేదలకు నేరుగా డీబీటీ ద్వారా రూ. 38 లక్షల కోట్లను పంపిణీ చేసిందని .. అదే కాంగ్రెస్ విధానం ఉండి ఉంటే అందులో రూ. 25 నుంచి 30 లక్షల కోట్లు అవినీతి మిగతా 2లో

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ సంబురాలు

✔ మూడ్రోజుల పాటూ నిర్వహణ ✔ ఊరూరా వేడుకలు
✔ తెలంగాణ కల్చర్ ఉట్టిపడేలా నిర్వహణ ✔ మాజీ సీఎం కేసీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూన్ 2తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు పూర్తి కానుంది. తెలంగాణ ఏర్పడి దశాబ్దం కావొస్తున్న సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా జూన్ 1, జూన్ 2, జూన్ 3 తేదీల్లో 3 రోజులపాటు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెలబ్రేషన్ జరగనుంది. ఈ మేరకు కార్యక్రమాల షెడ్యూల్ సైతం సోమవారం నాడు (మే 27న) విడుదల చేశారు.

### జూన్ 1 : తొలిరోజు

గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్ బండ్ వద్ద అమర జ్యోతి వరకు జూన్ ఒకటవ తేదీన సాయంత్రం 7 గంటలకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణ త్యాగాలు చేసిన అమరులకు పుష్పాంజలి ఘటించి, ఘన నివాళి అర్పించనున్నారు.

### జూన్ 2 : రెండో రోజు

ఇది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం. జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావమై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ముగింపు వేడుకల సభ నిర్వహిస్తారు. హైదరాబాద్ లోని బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన సభ జరుగనున్నది. హైదరాబాద్ నగరంలో పలు హాస్పిటల్స్, అనాథ శరణాలయాల్లో, పార్టీ ఆధ్వర్యంలో

మిగతా 2లో



# బిభవ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

**మొదటిపేజీ తరువాయి**

బెదిరింపులు వస్తున్నాయని విచారణ సందర్భంగా ఎంపీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా బిభవ్ అమాయకత్వాన్ని ప్రశ్నించారు. బిభవ్ కుమార్ తన ఫోన్ను ఫార్మాట్ చేశారని, స్వాతిపై దాడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని తొలగించారని ఆరోపించారు. ఈ క్రమంలో స్వాతి సీఎం నివాసంలోకి అనుమతి లేకుండా వెళ్లలేదని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ కోర్టుకు తెలిపారు. బాధ్యతల నుంచి బిభవ్ను తప్పించినా అతడు చాలా ప్రభావవంతమైన వ్యక్తి అని అతుల్ చెప్పారు. అయితే తమ క్లయింట్ బెయిల్ కోసం ట్రిపుల్ టెస్ట్ను పూర్తి చేశారని, అతడు సాక్ష్యాలను తారుమారు చేసే లేదా సాక్షులను ప్రభావితం చేసే అవకాశం లేదంటూ బెయిల్ అభ్యర్థించారు బిభవ్ తరఫు న్యాయవాదులు.

అయితే బిభవ్ కుమార్ను విడుదల చేస్తే తన ప్రాణాలకు ముప్పు ఉందని, తన కుటుంబానికి చాలా ప్రమాదకరమని విచారణ సందర్భంగా స్వాతి కోర్టుకు తెలిపారు. ఒక దశలో స్వాతి మాలీవాల్ కోర్టులో కన్నీరు పెట్టుకున్నారు. అంతేకాదు ఓ యూట్యూబర్ కారణంగా తనకు బెదిరింపులు వస్తున్నాయంటూ న్యాయస్థానానికి ఫిర్యాదు చేశారు.

వాదనల సందర్భంగా బిభవ్ కుమార్ లాయర్ పలు విషయాలు ప్రస్తావించారు. ముఖ్యమంత్రి నివాసంలో సీసీ కెమెరాలు లేని ప్రదేశాన్ని ఎంచుకుని, అక్కడే దాడి జరిగినట్లు మహిళా ఎంపీ చెబుతున్నారని ఆరోపించారు. అక్కడ రికార్డింగ్ సాధనాలు లేవన్న విషయం ఆమెకు తెలుసునన్నారు. మే 13న ఆమె సీఎం ఇంట్లోకి అనుమతి లేకుండా ప్రవేశించడం అతిక్రమణే అని కోర్టుకు తెలియజేశారు. ఎంపీ అయినంత మాత్రాన ముఖ్యమంత్రి ఇంట్లోకి ఆ రకంగా ప్రవేశించే అనుమతి ఇచ్చినట్లు కాదన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆమె సమస్యలు సృష్టించారని చెప్పారు. ఈ ఆరోపణలను విన్న మాలీవాల్ ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు.

# మరో 7 రోజులు బెయిల్ పొడిగించండి

- ప్రస్తుతం తీవ్రమైన వ్యాధి లక్షణాలు ఉన్నాయి
- పీఈటీ, సీటీ స్కాన్ చేయించుకోవాలి
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన అర్వింద్ కేజ్రీవాల్
- జూన్ 1 వరకే బెయిల్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేజ్రీవాల్ తన మధ్యంతర బెయిల్‌ను 7 రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే అరవింద్ కేజ్రీవాల్ అనారోగ్యంతో బాధపడుతున్నారని అందుకే పొడిగించాలని చెప్పారు. తనను అరెస్ట్ చేసిన తర్వాత బరువు 7 కిలోలు తగ్గానని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు తీవ్రమైన వ్యాధి లక్షణాలు ఉన్నాయన్నారు. అందుకే తాను పీఈటీసీటీ స్కాన్ సహా పలు పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో టెస్టులు చేయించుకోవడానికి మరో 7 రోజులు గడువు కావాలని సుప్రీంకోర్టును కోరారు.



### ఎప్పుడు లొంగిపోవాలి?

నిజానికి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు. సుప్రీంకోర్టు జూన్ 1 వరకు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న కేజ్రీవాల్ లొంగిపోవాల్సి ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మాత్రమే అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉన్నారు.

దాదాపు 51 రోజుల తర్వాత అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చారు. సుప్రీంకోర్టు అయనకు 21 రోజులు మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. సుప్రీంకోర్టులో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ ప్రభుత్వం 202122కి సంబంధించిన లిక్కర్ పాలసీని రూపొందించి అమలు చేయడంలో అవినీతి, మనీలాండరింగ్ జరిగిందని ఈ కేసులో ఆరోపణలున్నాయి.

# కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ప్రాసిక్యూషన్ చేయాలి

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ పాత్రపై స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ ఎందుకు అరెస్ట్ చేయడం లేదు
- ప్రభాకర్ రావును ఎందుకు భారత్‌కు రప్పించలేకపోతున్నారన్నారు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

కేసీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు రాధాకిషన్ రావు పోలీసుల విచారణలో వెల్లడించడం, గతంలో తాను చేసిన ఆరోపణలు ఇందుకు నిదర్శనమని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ అన్నారు. రాధాకిషన్ రావు కన్ఫెషన్ స్టేట్ మెంట్‌ను పరిశీలిస్తే ప్రతిపక్షాలపై ముఖ్యంగా బీజేపీపై దాడి కోసమే ఫోన్ ట్యాపింగ్‌ను ఉపయోగించుకున్నట్లు అర్ధమవుతోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



సానుభూతిపరులతోపాటు పార్టీకి విరాళాలు ఇచ్చే వాళ్లను, మీడియా ప్రతినిధులను సైతం ఫోన్ ట్యాపింగ్‌తో టార్గెట్ చేశారంటే బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు కమలం పార్టీ అంటే ఎంతగా వణుకు పుడుతుందో తెలుస్తోందన్నారు. లిక్కర్ కేసులో అడ్డంగా దొరికిన బిడ్డను కాపాడుకునేందుకే కేసీఆర్ ఎమ్మెల్యేల కొనుగోలు అంశాన్ని సృష్టించినట్లు రాధాకిషన్ రావు స్టేట్ మెంట్‌తో తేలిపోయిందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు అమెరికాలోనే ఉన్నట్లు తెలిసినా ఎందుకు భారత్‌కు రప్పించలేకపోతున్నారన్నారు. ప్రభాకర్ రావును అరెస్ట్ చేస్తే మరిన్ని వాస్తవాలు బయటకొచ్చే అవకాశముందన్నారు. అయినా ఎందుకు ఆ పని చేయడం లేదన్నారు.

తక్షణమే కేసీఆర్‌ను అరెస్ట్ చేసి ప్రాసిక్యూషన్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం నమ్మకం ఉన్నా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని తక్షణమే సీబీఐకి లేఖ రాయాలని కోరారు. సీబీఐతో సమగ్ర విచారణ జరిపించడంతో పాటు ఎమ్మెల్యే పదవికి కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటించే అంశంపైనా శాసనసభ స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ శాసనసభా పక్షాన కోరుతున్నామన్నారు.

# ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

**మొదటిపేజీ తరువాయి**

మధ్యవేలుకి వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నోటాకు ఓటు వేసే అవకాశం లేదు. ఉప ఎన్నిక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మద్యం దుకాణాలు మూసివేసి పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. సాయంత్రం 4 గంటల వరకు వరుసలో నిలబడిన వారందరికీ ఓటు వేసే అవకాశం ఉంటుంది. జూన్ 5న పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 2021 మార్చిలో జరిగిన ఎన్నికలో భారాస అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఈ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

# గాలివాన బాధితులను పరామర్శించిన కేటీఆర్

**మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం**



**విశాలభారతి,హైదరాబాద్ :**

హైదరాబాద్లో ఆదివారం కురిసిన వర్షానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫీజ్‌పేట్లో చనిపోయిన ఇద్దరు కుటుంబాలను బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు లక్ష రూపాయల సాయన్ని అందించారు. ఆదివారం విపరీతంగా గాలి దుమారంతో కూడిన వర్షం కురవడంతో కాంపౌండ్ వాల్ కూలి 51 ఏళ్ల అడ్వొకేట్ చనిపోగా రేకులపై ఉన్న రాయి మీద పడి 6 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. నిన్న కురిసిన వర్షానికి రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది చనిపోయారని, వర్షాకాలం రాకముందే ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకొని ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కేటీఆర్ కోరారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్వాసితులకు ఇవ్వాలన్నారు. బాధితులను వెంటనే జీహెచ్ఎంసీ షెల్టర్లకు తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# శ్రీధర్ రెడ్డి హత్యపై సమగ్ర విచారణ జరిపించాలి

## బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని చిన్నంబావి మండలం లక్ష్మిపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డీజీపీని కలిశారు. శ్రీధర్ రెడ్డి హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేశారు. శ్రీధర్ రెడ్డి హత్య జరిగి నాలుగు రోజులైనా ఎవరినీ అరెస్టు చేయలేదు. మంత్రి జూపల్లి మీద ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోలేదు. వారం రోజుల్లో న్యాయం జరగకపోతే ఆందోళనలు చేస్తాం అని ఆర్ఎస్పీ హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడుంది న్యాయం అని ప్రశ్నించారు. మంత్రి జూపల్లి అనుచరులను కనీసం ప్రశ్నించలేదు. దోషులను జైల్లో పెట్టాలని శ్రీధర్ రెడ్డి తండ్రి కోరుతున్నారు. హత్య జరుగుతుందని చిన్నంబావి ఎస్ఐకి ముందే తెలుసు. అయినప్పటికీ ఎస్ఐ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రేవంత్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు నెత్తుటేర్లు పారిస్తున్నారు. ఇంత జరిగినా జూపల్లిపై చర్యలేవి..? అసలు రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా..? ముఖ్యమంత్రే హోంమంత్రిగా ఉన్నాడు. సామాన్యులకు రక్షణ కల్పించకపోతే హోం మంత్రి ఎందుకు..? చిన్నంబావి ఎస్ ఐ, మంత్రి జూపల్లి చెప్పు చేతల్లో ఉన్నారు. జూపల్లితో కుమ్మక్కైన పోలీసులను డిస్మిస్ చేయాలి. శ్రీధర్ రెడ్డిని చంపిన నిందితుడు నిన్న మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంట్లో కూర్చొని ప్రెస్ మీట్ పెట్టాడు. నిందితులు మీ ఇంట్లోనే ఉంటే ఇంక బాధిత కుటుంబానికి న్యాయం ఏం చేస్తావు. మంత్రి జూపల్లిని బర్తరఫ్ చేయాలి. న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తాం అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

# మేం 38 లక్షల కోట్లు పేదలకు పంచాం

**మొదటిపేజీ తరువాయి**

రూపంలో మళ్లిపోయేవన్నారు.

### అవినీతి చేపలను పట్టుకుంటే గగ్గోలెందుకు?

రాజకీయ అవినీతి విషయంలో తాము ఉక్కుపాదం మోపుతున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పెద్ద పెద్ద చేపల్ని ఇప్పుడే పట్టుకుంటున్నామని తెలిపారు. అయితే వాళ్లను ఎందుకు పట్టుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. ఖాన్ మార్కెట్ గ్యాంగ్ ఇలానే వ్యవహరిస్తోందని.. ఇందులో రాజకీయ కుట్ర ఉందన్న ఓ నేరేటివ్ ను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో సోనియాగాంధీని జైలుకు పంపాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఇప్పుడు ఆయనే అరెస్ట్ అక్రమం అని ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. అవినీతి వ్యవస్థల్ని నాశనం చేస్తుందని స్వతంత్ర దర్యాప్తు సంస్థల మీద కూడా ఖాన్ మార్కెట్ గ్యాంగ్ నిందలు వేస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థలు విచారణ చేస్తున్నాయి.. న్యాయవ్యవస్థ శిక్షలు విధిస్తుందని అందులో రాజకీయ ప్రమేయమే ఉండని స్పష్టం చేశారు.

బీజేపీ సిద్ధాంతాలు నచ్చని సినిమా వాళ్లనూ కలిశా ! బీజేపీకి నచ్చితేనే కలుస్తారన్న అభిప్రాయాలను తాము ఎప్పుడో పటాపంచలు చేశామని మోదీ తెలిపారు. సినీ ఇండస్ట్రీకి చెందిన ఎంతో మందిని కలిశనని.. అందులో బీజేపీ విధానాలు.. ప్రభుత్వ విధానాలు నచ్చని వారు కూడా ఉన్నారన్నారు. తమను వ్యతిరేకిస్తున్నారని వారిని వ్యతిరేకించడం దూరం పెట్టడం కాదని.. వారి సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించడమే తన విధి అని ప్రధాని మోడీ తెలిపారు.

### ఇండియా ఫస్ట్ అనేదే మా విదేశాంగ విధానం

భారత విదేశాంగ విధానానికి ఒకటే ప్రాతిపదిక అని మోదీ స్పష్టం చేశారు. ఇండియా ఫస్ట్ అనే విధానాన్ని విదేశీ మంత్రిత్వ శాఖకు తాను చెప్పానన్నారు. మొత్తంగా మూడు విషయాలపై వారికి దిశానిర్దేశం చేశానన్నారు. మన వేరే దేశాలకు ఎగుమతి చేయడం.. అవసరమైన టెక్నాలజీని ఇతర దేశాల నుంచి తెచ్చుకోవడం.. భారత్ కు పర్యాటకుల సంఖ్యను పెంచడం వంటి మూడు విషయాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలని విదేశాంగశాఖకు సూచించామన్నారు. తాము తీసుకున్న నిర్ణయాల్లో ఇండియా ఫస్ట్ అనే మూల సూత్రాన్ని పాటిస్తామన్నారు.

# ఈనెల 31వ తేదీన విచారణకు హాజరైతా

**మొదటిపేజీ తరువాయి**

లోక్‌సభ ఎన్నికల తొలి దశకు ముందు ప్రజ్వల్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అతను దౌత్య పాస్‌పోర్ట్‌తో విదేశాలకు పారిపోయాడు. ఇక అప్పటి నుంచి భారత్‌కు తిరిగిరాలేదు. దీంతో అతనిపై పోలీసులు అరెస్ట్ వారెంట్ కూడా జారీ చేశారు. ఇక పోలీసుల ఎదుట లొంగిపోవాలంటూ ప్రజ్వల్‌కు కుటుంబ సభ్యులు ఎన్ని హెచ్చరికలు చేసినా స్పందించలేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా అతను దర్యాప్తు సంస్థ సిట్ ముందు విచారణకు హాజరవుతానంటూ ప్రకటించారు. తనపై వచ్చిన ఆరోపణలతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయినట్లు చెప్పారు.

'నన్ను తప్పుపట్టొద్దు. నాపై తప్పుడు కేసులు పెట్టారు. మే 31వ తేదీ ఉదయం 10 గంటలకు సిట్ ఎదుట హాజరవుతాను. విచారణకు సహకరిస్తాను. న్యాయస్థానంపై నాకు నమ్మకం ఉంది' అని తెలిపినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. నివేదికల ప్రకారం.. రాజకీయ కుట్రలో భాగంగానే తనపై తప్పుడు కేసులు పెట్టినట్లు ప్రజ్వల్ తెలిపారు. ఇప్పటి వరకూ తాను ఎక్కడున్నానో చెప్పనందుకుగానూ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలకు క్షమాపణలు చెప్పారు.

'విదేశాల్లో నేను ఎక్కడ ఉన్నానో సరైన సమాచారం అందించనందుకు నా కుటుంబ సభ్యులకు, మా కుమారన్న (హెచ్‌డి కుమారస్వామి), పార్టీ కార్యకర్తలకు క్షమాపణలు చెప్పాలనుకుంటున్నాను. ఏప్రిల్ 26వ తేదీన ఎన్నికలు ముగిసినప్పుడు నాపై ఎలాంటి కేసూ లేదు. నేను విదేశాలకు వెళ్లిన రెండు రోజుల తర్వాత నాపై వచ్చిన ఆరోపణలను యూట్యూబ్‌లో చూశాను. అప్పుడు ఏడు రోజుల సమయం కావాలంటూ సిట్‌కు లేఖ రాశాను' అని ప్రజ్వల్ ఇండియా టుడేకి తెలిపారు. రాజకీయ కుట్రలో భాగంగానే తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ మేరకు సిట్ ముందు హాజరై విచారణకు సహకరిస్తానని తెలిపారు.

# మోడీ ప్రధాని అవ్వడం అంత ఈజీ కాదు

**మొదటిపేజీ తరువాయి**

పథకాన్ని తొలగిస్తాం. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తాం. నెలనెలా ప్రతీ మహిళా బ్యాంకు ఖాతాలో రూ.8,500 జమ చేస్తాం'' అని హామీ ఇచ్చారు.

### కుంగిన ప్రచార వేదిక.. పట్టు కోల్పోయిన రాహుల్

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మిసా భారతి పాటలీపుత్ర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆమె తరఫున ప్రచారంలో రాహుల్ పాల్గొన్నారు. ఈ క్రమంలో స్టేజీ కాస్త కుంగింది. దీంతో రాహుల్ పట్టుకోల్పోతుండగా.. పడిపోకుండా భారతి సాయం చేశారు.

# ఉద్యమం ప్రతిబింబించేలా చిహ్నం

- రాచరికపు ముద్రలు ఉండొద్దు
- రాష్ట్ర గీతానికి తుదిమెరుగులు పూర్తి
- తెలంగాణ తల్లి రూపం కొలిక్కి
- అంగరంగవైభవంగా అవతరణ దినోత్సవం





**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నం తుది మెరుగులు దిద్దుకుంటోంది. ప్రముఖ చిత్రకారుడు రుద్ర రాజేశం ఈ చిహ్నాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈనేపథ్యంలో ఆయన నేతృత్వంలోని బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. సుమారు 12 నమూనాలు రూపొందించగా.. వాటిలో ఒకటి సీఎం రేవంత్‌రెడ్డి ఖరారు చేశారు. ఎంపిక చేసిన దానిలో కొన్ని మార్పులు సూచించారు. గత చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణం ఉన్నాయి. అయితే, రాచరికపు ముద్రల బదులుగా ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమం ప్రతిబింబించేలా ఉండాలని సీఎం భావిస్తున్నారు. ఈ మేరకు రూపొందే చిహ్నన్నే.. జూన్ 2న ఆవిష్కరించనున్నారు. ఇక రాష్ట్ర గీతంగా ఖరారు చేసిన 'జయ జయహే తెలంగాణ'కు తుది మెరుగులు దాదాపు పూర్తయ్యాయి. సీఎం సూచనలతో భావం, భావోద్వేగం మారకుండా రెండు నిమిషాల గీతంలో కవి అందెశ్రీ మార్పులు చేశారు. సీఎం రేవంత్, అందెశ్రీ సూచనలకు అనుగుణంగా సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి స్వరకల్పన చేశారు. ఈ గీతాన్ని కూడా జూన్ 2న ఆవిష్కరించనున్నారు. మరోవైపు తెలంగాణ తల్లి రూపం ఓ కొలిక్కి వస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర అవతరణ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు సూచించారు. ఈ మేరకు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జూన్ 2న ఉదయం గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పిస్తారని, ఆ తర్వాత సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరిస్తానని చెప్పారు.



''జూన్ 2న ట్యాంక్‌బండ్‌పై స్వయం సహాయక బృందాలకు చెందిన హస్తకళలు, చేనేత కళల స్టాళ్లు ఏర్పాట్లు చేస్తాం. నగరంలోని ప్రముఖ హోటళ్ల ఫుడ్ స్టాళ్లు, పిల్లలకు క్రీడలతో కూడిన వినోదశాలలూ ఏర్పాటు అవుతాయి. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు కళారూపాల కార్నివాల్ జరుగుతుంది. అందులో బాణసంచా, లేజర్ షో ఉంటాయి. 5 వేల మంది శిక్షణ పోలీసులు బ్యాండ్ ప్రదర్శన చేస్తారు''అని సీఎస్ తెలిపారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ సంబురాలు

**మొదటిపేజీ తరువాయి**

పండ్లు, స్వీట్లు పంపిణీ చేయనున్నారు.

### జూన్ 3: మూడో రోజు

ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయాల్లో ..తెలంగాణ ఆవిర్భావ దశాబ్ధి ముగింపు వేడుకలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను మరియు జాతీయ జెండాను ఎగరవేస్తారు. ఆయా జిల్లాల్లోని దవాఖానల్లో అనాథ శరణాలయాల్లో స్వీట్లు పండ్లు పంపిణీ చేస్తారు

# పదేళ్లలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారు

**మొదటిపేజీ తరువాయి**

పదవులు అడిగితే ఉన్న పదవి కూడా పోతుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీలో అధ్యక్ష పదవి కావాలని ఎవరు అడిగేంత ధైర్యం చేయరని, అడిగినా మార్చడం సాధ్యం కాదని జగ్గారెడ్డి ఆరోపించారు. దేశంలో ప్రాజెక్టులు నిర్మించి, వ్యవసాయభివృద్ధికి దోహదం చేసింది, విద్యుత్తు ఉత్పత్తిని పెంచిందెవరని ప్రశ్నించారు. భవిష్యత్ గురించి ఆలోచించి గతంలో ఎఫ్‌సీఐని ఏర్పాటు చేసి ఆహార ధాన్యాలు నిల్వ ఉంచుకునేందుకు ముందు చూపుతో నెహ్రూ చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆస్తులను పెంచితే బీజేపీ వాటిని ధారాదత్తం చేస్తూ వస్తోందని విమర్శించారు.



## మోడల్ స్కూల్లో హాస్టల్ సౌకర్యానికి మోక్షం ఎప్పుడు

- హాస్టల్ వసతి కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్

**ఆర్మూర్, విశాల భారతి.** నందిపేట్ మండల కేంద్రంలో గల పలుగుట్ట వద్ద మోడల్ స్కూల్లో హాస్టల్ సదుపాయం కల్పించాలని మండల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. హాస్టల్ వసతి సదుపాయం కల్పిస్తే తమ పిల్లలకు రవాణా చేసే సౌకర్యం తగ్గుతుందని అన్నారు. హాస్టల్ వసతి నిర్మాణంలో ఉండడం వల్లనే ప్రారంభానికి నోచుకోలేదని విమర్శలు ఉన్నాయి. కేజీబీవీల అధికారులు తాత్కాలికంగా మోడల్ స్కూల్ హాస్టల్ ల బాధ్యతలను చూడాలని ఆదేశాలు ఉన్నప్పటికీ హాస్టల్ నిర్వహణను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చూసేవారు. అయితే తమ జాబ్ చాటులో ఈ విధులు లేవని ప్రిన్సిపాల్ లు కోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా తీర్పు రావడంతో విద్యాశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలి. ఇకనైనా 20242025 విద్యా సంవత్సరానికి హాస్టల్ సదుపాయాలను కల్పించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ముత్యాల శివ కుమార్ (భాద్గుణ)**
నందిపేట్ లో హాస్టల్ సౌకర్యం లేక విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించి హాస్టల్ వసతిని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలి. విద్యార్థులు స్కూలుకు వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని అన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం

- ఇండ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం
- ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వీడని అధికారులు, సిబ్బంది
- ఆందోళనలో గ్రామస్థులు



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**మా గ్రామంలో ఇళ్ల పై వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఇబ్బంది పడుతున్నామని సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని యాచారం మండలంలోని ధర్మన్నగూడ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇళ్ల పై 11 కేవీ విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ఎప్పుడు కింద పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇళ్ల పై నిల్చోని చేయి పైకెత్తితే తాకేంత ఎత్తులో విద్యుత్ తీగలు అత్యంత ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. గతంలో ఇంటి పైకి వెళ్ళిన ఓ బాలుడు వేలాడుతున్న విద్యుత్ తీగల తగిలి శాశ్వతంగా అంగవైకల్యం చెందాడు. చిన్నపాటి ఈదురు గాలులు వీచినప్పుడు తీగలు ఒకదానికొకటి తాకి నిప్పురవ్వలు ఎగసి పడుతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఇనుప విద్యుత్ స్థంబాలు ఉన్నాయని , వర్షం వచ్చినప్పుడు ఎవరైనా ఇనుప స్థంభాలను పట్టుకుంటే విద్యుత్ ఘాతం తో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రమాదాల బారిన పడుతున్నా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వెంటనే గ్రామంలో ఇనుప స్థంబాలు తొలగించి వేరే స్థంబాలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం పొంచి ఉందని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు



### ఎన్నో సార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదు.



ఇళ్ల పై విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని , ట్రాన్స్ఫర్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పాత స్తంభాలు శిథిలావస్థకు చేరి పక్కకు ఒరిగి పడిపోయే స్థితిలో ఉన్నప్పటికీ విద్యుత్ సిబ్బంది రావడం లేదు. గ్రామంలోని ఇనుప స్థంబాలు తొలగించాలి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

**బుర్రి వెంకటేష్ ధర్మన్నగూడ గ్రామస్తుడు.**



## ముచ్కూర్ సొసైటీ చైర్మన్ గా బంగ్లా దేవేందర్ ఎన్నిక

- హాజరైన డైరెక్టర్లు

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం ముచ్కూర్ ప్రాథమిక సహకార సంఘం నూతన చైర్మన్ గా బంగ్లా దేవేందర్ ఎన్నికయ్యారు. సోమవారం ఉదయం ఎన్నికల అధికారి సత్యనారాయణ సమక్షంలో ఈ ఎన్నిక కొనసాగింది. సహకార సంఘంకు సంబంధించిన 13 మంది డైరెక్టర్లకు 10మంది డైరెక్టర్లు కొరంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన బంగ్లా దేవేందర్ మాత్రమే చైర్మన్ గా నామినేషన్ దాఖలు చేశారు.ఒకే ఒక్క నామినేషన్ రావడంతో ముచ్కూర్ సొసైటీ చైర్మన్ గా బంగ్లా దేవేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ ప్రకటించారు. ప్రస్తుతం ఇంఛార్జి చైర్మన్ గా వున్న మాలవత్ వెంకటేష్ తన పదవిని కోల్పోయారు. అనంతరం బంగ్లా దేవేందర్ కు చైర్మన్ గా ఎన్నికైన నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తెడ్డు అశోక్, గంగాధర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



## రైతులకు విత్తన కొనుగోలుపై అవగాహన

**భీమదేవరపల్లి విశాల భారతి** రాష్ట్ర ప్రభుత్వాదేశానుసారం ఖరీఫ్ పంట సాగుకు సిద్ధమవుతున్న రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ముత్తారాం విశ్వనాధ కాలనీ మాణిక్యపూర్ వంగరగట్ల నర్సింగపూర్, బొల్లోనిపల్లి మల్లారం రసూల్ పల్లి వీర్లగడ్డ తండా గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి దామోదర్ ఆధ్వర్యంలో రైతులకు విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు చేరవేయాలనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధికారి దామోదర్ రెడ్డి తెలిపారు. వదులుగా ఉన్న, తెల్ల గుడ్డ సంచులలో ఉన్న విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని రైతులకు తెలియజేశారు. తప్పనిసరిగా సీల్డ్ ప్యాకెట్లలో ఉన్న విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుండి తప్పనిసరిగా రసీదును తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకేజ్ మరియు బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని పేరొన్నారు. వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన అధికృత డీలర్ల దగ్గర మాత్రమే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ ప్రశాంత్, నాగరాజు, కిషోలైట్ ఆశాదీప్, కమల్ హాసన్, బిందు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.



## వసంత ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం అందజేత

**భీమదేవరపల్లి విశాల భారతి** `మండలంలోని పలు గ్రామాల్లో పెద్ది వసంత గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు నిత్యాసర వస్తువులు అందజేస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు పెద్ది వెంకటనారాయణ ఆదేశాల మేరకు మండలంలో కాంగ్రెస్ నాయకులు మృతుల కుటుంబాలకు,ఉచిత వైద్య సేవలు పలు కార్యక్రమాలకు ముందుండి నడిపిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసంత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊస కోయిల, ప్రకాష్, పొన్నాల మురళి, బొల్లి సుమన్, సంపత్ రాజు, కొమరయ్య ,రామ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.



## భీమ్‌గల్ ఐకేపీ కార్యాలయంలో అవగాహన సదస్సు

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలంలోని ఐకేపీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వ పాఠశాల యూనిఫామ్ టైలరింగ్ గురించి అవగాహన,శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ మండలం ఐకెపి ఎపిఎం రవీందర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్ మహిళా శక్తి టైలరింగ్ సెంటర్ ల ద్వారా కుట్టించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అందుకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఆ గ్రామంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల చేత స్కూల్ యూనిఫామ్ లు తయారీపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిసి నరేష్, సాయిలూ, గడాల రఘు పతి, భాస్కర్, గంగ లలిత,మహిళ సభ్యులు పాల్గొన్నారు.




## భారంగా రైతువేదికల నిర్వహణ

- నెలల తరబడి నిలిచిన నిధులు

**భీమదేవరపల్లి విశాల భారతి** రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్లస్టరకు ఒకటి చొప్పున నిర్మించిన రైతు వేదికల నిర్వహణ ప్రశ్నార్థకమైంది. వీటి నిర్వహణకు నిధులు సకాలంలో రాక పోవడంతో నిర్వహణ మసక బారుతోంది. ఎక్కడ చూసినా రైతు వేదికలు దుమ్ము దూళితో కనిపిస్తున్నాయి. సమావేశాలకు ఉన్నత స్థాయి అధికారులు వస్తే మాత్రం రైతువేదికలను కూలీలు లేదా ప్రైవేట్ కార్మి కులతో చేయిస్తున్నారు. టీ, టిఫిన్, తాగునీరు, ఎఈఓలే భరిస్తున్నారు. ఏఈఓలు పట్టించుకోని చోట రైతు వేదికలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.క్లస్టర్ 6 రైతు వేదికలు ఉన్నాయి. గత తెలంగాణ ప్రభుత్వం రూ.22 లక్షలతో ఒక్కో రైతువేదిక నిర్మించారు. ఇందులో విద్యుత్ బిల్లుకు రూ.1,000 పారిశుద్ధ్య నిర్వహణకు రూ.3,000,రైతుల శిక్షణకు రూ.2,500 తాగునీటికి రూ.500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్స్,ఇతర ఖర్చులకు రూ.2,000 కేటాయించారు. ప్రభుత్వం గతేడాది నుంచి నిధులు నిలిపివేయడంతో వాటి నిర్వహణ భారమైంది. దీంతో గదులను శుభ్రం చేయించడం ఏఈఓలకు తలకు మించిన భారమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం సకా లంలో నిధులు విడుదల చేయాలని రైతులు ఇటు అధికారులు కోరుతున్నారు.

# కవిత బెయిల్ పిటిషన్ నేడు విచారణ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారానికి (నేడు) వాయిదా వేసింది. సీబీఐ, ఈడీ కేసుల్లో దాఖలైన బెయిల్ పిటిషన్లపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ మంగళవారం విచారణ చేపట్టనున్నారు. పిటిషన్‌లో కవిత బెయిల్‌తో పాటు అరెస్టు, డిమాండ్‌ను సైతం సవాల్ చేశారు. కవిత తరఫున న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. అరెస్టు సమయంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు చట్టాన్ని ఉల్లంఘించాయన్నారు. ఇప్పటికే ఈడీ, సీబీఐ కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశాయి. నేడు మధ్యాహ్నం 12 గంటలకు కోర్టు విచారణ జరిపే అవకాశం ఉన్నది. కవిత తరఫు న్యాయవాది పలు కీలక విషయాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఆమెపై కఠిన చర్యలు తీసుకోబోమంటూ సుప్రీంకోర్టులో ఈడీ అండర్ టేకింగ్ ఇచ్చిందని.. కవిత వేసిన రిట్ పిటిషన్ సుప్రీంలో పెండింగ్‌లో ఉండడంతో విచారణ ముందుకు సాగడం లేదంటూ ఈడీ సుప్రీంకోర్టుకు లేఖ రాసిందని పేర్కొన్నారు. తాము ఇచ్చిన అండర్ టేకింగ్ తదుపరి వాయిదా వరకే అని అందులో స్పష్టం చేశారన్నారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉండగానే 41 (ఏ) ప్రకారం సమన్లు జారీ చేశారని న్యాయవాది విక్రమ్ చౌదరి పేర్కొన్నారు. సీఆర్‌పీసీ 161 ప్రకారం.. నోటీసులు ఇచ్చారని.. ఆ తర్వాత 41 (ఏ)కు ఎందుకు మారారో తెలియదని.. సుప్రీంలో విచారణ సమయంలోనే ఈడీ బృందం కవిత ఇంట్లో ఉందన్నారు.
అదే రోజు ఆమెను అదుపులోకి తీసుకుంటున్నట్లు ప్రకటించిందన్నారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉండగానే కవితను ప్రశ్నించాలంటూ సీబీఐ పిటిషన్ వేసిందని.. ఆ పిటిషన్‌ను న్యాయస్థానం అంగీకరించిందని.. కానీ, దీని గురించి కవితకు మాత్రం ఎలాంటి సమాచారం లేదన్నారు. సీఆర్‌పీసీ నిబంధనల ప్రకారం సీబీఐ ప్రశ్నించాలంటే కవిత వాదన కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కనీసం అరెస్ట్ వారెంట్ కూడా లేకుండానే సీబీఐ అరెస్టు చేసిందని పేర్కొంది. పిటిషన్లపై మంగళవారం కౌంటర్ వాదనలను వినిపించనున్నట్లు న్యాయస్థానానికి ఈడీ చెప్పింది.

## అనుమతులు తీసుకొని ఇసుక సరఫరా చేయాలి

**వనపర్తి విశాల భారతి:** గృహ నిర్మాణాలకు, ప్రభుత్వ పనులకు నాణ్యమైన ఇసుకను అందుబాటులో ఉంచే విధంగా తహాశీల్దార్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం ఐ.డి. ఒ.సి. కాన్ఫరెన్స్ హాల్లో మన ఇసుక వాహనం పై జిల్లాస్థాయి కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో ఇసుక మాఫియా లేకుండా చేసేందుకు పంచాయతీ సెక్రటరీ నుండి అనుమతి పొందిన గృహ నిర్మాణాలకు, ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో జరుగుచున్న ప్రభుత్వ నిర్మాణ పనులకు నాణ్యమైన ఇసుకను ప్రభుత్వ ధరకు సరఫరా చేసేవిధంగా తహాశీల్దార్లు వే బిల్లు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. స్థానిక అవసరాలకు ఇసుకను ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం వే బిల్లులు ఇవ్వాలని, అనుమతి కంటే ఎక్కువ ఇసుక తరలిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, ఏ.డి.మైన్స్ పి. శ్రీనివాస్, తహసిల్దార్ కిషన్ నాయక్, జూమ్ యాప్ ద్వారా తహాశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా మేడిగడ్డ మరమ్మతులు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మేడిగడ్డ బ్యారేజీ తాత్కాలిక పునరుద్ధరణ చర్యల్లో భాగంగా రోజుకో సమస్య ఎదురవుతోంది. ఒక సమస్యను పరిశీలించి, ముందడుగు వేసే క్రమంలో మరో సమస్య తలెత్తుతుంది. బ్యారేజీ దెబ్బతిన్న ఏడో బ్లాక్ ప్రాంతం వరద ఉద్ధృతిని తట్టుకునే విధంగా షీట్ పైల్స్ ఏర్పాటు పనులను ఆదివారం ప్రారంభించారు. మేడిగడ్డ బ్యారేజీ దిగువ ప్లాట్‌ఫాం వద్ద సీసీ బ్లాకుల్లో ఒక వరుస తొలగిస్తున్నారు. తదుపరి షీట్ పైల్స్ ఏర్పాటు పూర్తి చేస్తారు. బ్యారేజీలో గేట్లు తొలగించేందుకు కటింగ్ పనులు సాగుతున్నాయి. దెబ్బతిన్న గేట్లలో 15వ గేటును ఎత్తగా 16వ గేటు ఎత్తే క్రమంలో పలు ఇబ్బందులు ఎదురయ్యాయి.18, 19, 20, 21 గేట్లను పూర్తిగా కట్‌చేసి తీయాల్సిన పరిస్థితులుండగా ప్రస్తుతం 20వ గేటు కటింగ్ పనులు జరుగుతున్నాయి.16, 17, 22 గేట్లను సాధారణ స్థితిలో ఎత్తడం వీలు కాకపోతే కటింగ్‌తో తొలగించనున్నారు. మరోవైపు ఏడో బ్లాక్ ప్రాంతంలో బుంగ, నీటి ఊటలు ఏర్పడగా వాటిని నియంత్రించడానికి ఇసుకను నింపుతున్నారు. గ్రౌటింగ్ చేయడానికి యంత్రాలు, సామగ్రిని సమకూర్చుకుంటున్నారు. సోమవారం లేదా మంగళవారం గ్రౌటింగ్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 85 గేట్లున్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ గేట్లన్నీ ఎత్తి ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ సూచించింది. ఇందులో భాగంగా ఒకటి నుంచి ఆరో బ్లాక్ వరకు, అలాగే ఎనిమిదో బ్లాక్‌లోను ఉన్న మొత్తం గేట్లు 74 పూర్తి స్థాయి నీటిమట్టం వరకు ఎత్తి ఉంచారు. దెబ్బతిన్న ఏడో బ్లాక్‌లో మొత్తంగా 11 గేట్లు ఉండగా ఎనిమిది గేట్లపై ప్రభావం ఉండడంతో అవి మూసి ఉన్నాయి. ఇందులో మిగిలిన వాటితో కూడా కలిపి మొత్తం 77 గేట్లు పైకెత్తారు. రెండు గేట్లను పూర్తిగా తొలగించాలి. ఆరు ఎత్తాల్సి ఉంది. ఇందులో ఒక గేటు 90 మీటర్ల వరకు మాత్రమే ఎత్తారు. మిగిలిన గేట్లన్నీ అలానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మిగిలిన గేట్లను ఎత్తడం కోసం ఇంజినీర్లు కసరత్తు చేస్తున్నారు

# రాష్ట్రానికి వస్తున్న 20 కంపెనీల బలగాలు

### ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా

**విశాలభారతి ఆంధ్రప్రదేశ్:**




ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లు, దాడులను దృష్టిలో ఉంచుకొని కౌంటింగ్ నాటికి రాష్ట్రానికి 20 కంపెనీల బలగాలను రప్పిస్తున్నట్లు ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. కౌంటింగ్ రోజు, ఆ తర్వాత కూడా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం ఆయన పరిశీలించారు. మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు భౌతికంగా రెండు పర్యాయాలు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. పల్నాడులో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, కేవలం పోలింగ్ తర్వాత మాత్రమే అల్లర్లు జరిగాయని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



## కాంగ్రెస్ నాయకుల సమక్షంలో నెహ్రూ వర్ధంతి వేడుకలు

**ఆర్మూర్, విశాల భారతి** డొంకేశ్వర్ మండల కేంద్రంలో భారతదేశ మొట్టమొదటి మాజీ ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిసెరాం భూమేష్ రెడ్డి, సుంకరి నాగరాజు, చాయ చాందు,బాపు రావు, దత్తపుర్ రమణ, గోపి, గోపిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# బ్లాస్టింగ్ తో భయం భయం

- ఎలాంటి జాగ్రత్తలు లేకుండా బ్లాస్టింగ్ లు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటూ రైతుల వేడుకోలు



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** యాచారం మండలంలోని మాల్ గ్రామ అతి సమీపంలో సోమవారం ఉదయం బ్లాస్టింగ్ కలకలం రేగింది. మాల్ నుంచి నల్లవెల్లి గ్రామానికి వెళ్ళే కొద్ది దూరంలో నూతనంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. దానిలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా పెద్దగా పరుచుకొని ఉన్న ఓ బండరాయిని కంప్రేషర్ సాయంతో జిలెటెన్ స్టిక్స్, డిటోనేటర్ల తో బ్లాస్టింగ్ చేయడంతో బండరాళ్లు ఎగిరి పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలో పడ్డాయి. గత మూడు, నాలుగు రోజులుగా బండ రాయి పగులగొట్ట డానికి బ్లాస్టింగ్ లు చేస్తున్నారని అటు వైపు వెళ్ళాలంటే భయమేస్తుందనీ రైతులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో పశువులకు పాలు పిండే సమయంలో ఎలాంటి సమాచారం లేకుండా బ్లాస్టింగ్ చేయడంతో పశువులు జంకుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఎటు నుండి బండరాళ్లు వచ్చి పడతాయో తెలియని పరిస్థితి నెలకొందని, జిలెటెన్ స్టిక్స్, డిటోనేటర్ల వినియోగానికి అడ్డు అదుపు లేకుండా పోతోందంటున్నారు. కొండలు, గుట్టలే నిబంధనల ప్రకారం ప్లాట్లలోగానీ, పట్టా భూములలో బ్లాస్టింగ్ చేస్తే పోలీసుల అనుమతి తీసుకోవాలి అలాంటిది మరి పర్మిషన్ తీసుకుని చేస్తున్నారో లేక పర్మిషన్ లేకుండా చేస్తున్నారో కానీ ఎలాంటి జాగ్రత్తలు లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారని, సంబధిత అధికారులు తక్షణమే పట్టించుకోని సమస్యను పరిష్కరించాలని అక్కడి రైతులు కోరుతున్నారు.

# వర్షా కాలంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి

- పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



**ఇబ్రహీంపట్నం ,విశాలభారతి:** ఆదిభట్ల మున్సిపాలిటీ లోని కొంగర కలాన్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక వాతావరణ మార్పులపై (వర్షపాతం) అదనపు కలెక్టర్లు ప్రతీమా సింగ్, భూపాల్ రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ సూచనలు చేస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు మరింత అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అధికారుల నేతృత్వంలో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితుల పై చర్చించాలని, చేపట్టాల్సిన తక్షణ చర్యల విషయమై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మండల స్థాయి సమావేశం నిర్వహించడానికి ముందు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నివాస ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు, రక్షిత మంచి నీటి సరఫరా జరిగేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ఎక్కడైనా నీరు నిలువ ఉంటే దోమల వ్యాప్తిని నిరోధించేందుకు వీలుగా ఆయిల్ బాల్స్ వేయించాలని అన్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు కల్పించినా, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున అధికారులు, సిబ్బంది అందరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు వీలుగా వారిని బయటకు వెళ్లేందుకు అనుమతించకూడదని తెలిపారు. ముఖ్యంగా షార్ట్ సర్క్యూట్ తో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున, అవసరమైన చోట తక్షణ మరమ్మతులు జరిపించాలని ఆదేశించారు. భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఆటంకం లేకుండా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లుగా కేటాయించబడిన అధికారులు పరిశీలించి గ్రామాల వారీగా నివేదికలు సమర్పించాలని తెలిపారు. దెబ్బతిన్న చెరువులు, చెక్ డ్యాంలు, కాల్వలు తదితర వాటి వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.





# హైదరాబాద్ నుంచి పుదిచ్చేరి కి సైకిల్ యాత్ర

- ప్రారంభించిన కాంగ్రెస్ నేత నీలం

**పటాన్ చెరు,విశాలభారతి:** హైదరాబాద్ నుంచి పుదుచ్చేరికి నలుగురు సైకిలిస్టులు ప్రారంభించిన సైకిల్ యాత్రను మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ప్రారంభించారు. సోమవారం చిట్కుల్ లోని నీలం మధు క్యాంపు కార్యాలయంలో సైక్లింగ్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. బీహెచ్ఈఎల్ కు చెందిన నలుగురు యువకులు ధనరాజ్ గౌడ్, అరుణ్ తేజ్ గౌడ్, బద్రీనాథ్, పవన్ చిట్కుల్ నుంచి పుదుచ్చేరి వరకు ఈ సైకిల్ యాత్ర చేయనున్నారు. సుమారు 11 నుంచి 12 రోజులు సైకిల్ పై ప్రయాణించి పుదుచ్చేరికి చేరుకోనున్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ ఈ నలుగురు యువకులు సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. హైదరాబాదు నుంచి పుదుచ్చేరి మధ్యలో వివిధ ప్రాంతాల సాంస్కృతిని ప్రజలకు చేరవేసే విధంగా యువకులు నడుంబిగించడం సంతోషంగా ఉందన్నారు. సైకిల్ పై యాత్రను కొనసాగిస్తున్న యువకులకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సైక్లిస్ట్ ల సమస్యల పరిష్కారానికి వారి అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు నరసింహా రెడ్డి, మాజి సర్పంచ్ వెంకన్న, మాజీ పిఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, తిరుమల్ రెడ్డి, సంగ్రం, మధుసూదన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థ పదార్థాల నిర్వహణపై 14వ అంతర్జాతీయ సదస్సుకు గీతం ఆతిథ్యం

**పటాన్ చెరు,విశాలభారతి:** ఐపీఎల్ గ్లోబల్ ఫోరమ్ వారి 14వ అంతర్జాతీయ సదస్సుకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అతిథ్యం ఇవ్వబోతున్నట్టు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. 'స్థిరమైన వ్యర్థ పదార్థాల నిర్వహణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ' (సస్టెయినబుల్ వేస్ట్ మేనేజ్ మెంట్, అండ్ సర్క్యులర్ ఎకానమీ)పై ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1 వరకు నాలుగు రోజుల అంతర్జాతీయ సదస్సును గీతమ్ లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్ మెంట్, ఎయిర్ అండ్ వాటర్ ఆధ్వర్యంలో, ఐక్యరాజ్య సమితి ప్రాంతీయాభివృద్ధి కేంద్రంతో (యుఎన్ ఆర్ సీడీ) సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలు సంస్థల సహకారంతో ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సదస్సు హైబ్రిడ్ విభాగంలో నిర్వహిస్తున్నామని, ప్రతినిధులు స్వయంగా హాజరు కావడాన్ని ప్రోత్సహిస్తున్నామని, అయితే అందుకు వీలుకాని వారు వర్చువల్ (ఆన్ లైన్ విధానంలో పాల్గొనవచ్చున్నారు.. మాస్టర్స్/పీహెచ్ డీ విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వ సంస్థలు, మునిసిపాలిటీలు, మురుగు నీటి నిర్వహణ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సదస్సులో పరిశోధనా పత్రాలను సమర్పించవచ్చన్నారు. ఆయా జర్నల్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్పించిన పూర్తిస్థాయిలో సిద్ధంచేసిన పత్రాలను సాలిడ్ వేస్ట్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్, జర్నల్ ఆఫ్ ఎనర్జీ సెక్టార్ మేనేజ్మెంట్ వంటి నాటి ప్రత్యేక / సాధారణ సంచికలలో ప్రచురిస్తారని తెలియజేశారు. ఆయా పత్రాలను iconswmce@gitam.edu లేదా iconswm.ce@iswmaw.net ఆసక్తి గలవారు తమ పేర్ల నమోదు, ఇతరత్రా వివరాల కోసం సదస్సు నిర్వాహకుడు డాక్టర్ వెబైల్.పీ. తోరాని (డాక్టర్ వైఎల్పి థోరని) ని 88867 85076 ద్వారా సంప్రదించాలన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆతిథ్యం ఇస్తున్న 14వ అంతర్జాతీయ సదస్సులో వ్యర్థ పదార్థాల నిర్వహణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థలోని నిపుణులతో ముఖాముఖి చర్చించే అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు.

# కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ తో స్పీకర్ గడ్డం ప్రసాద్ భేటీ



**విశాలభారతి,కంటోన్మెంట్ :** ఎన్నికల ఫలితాలు రానున్నాయి.ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ఉప ఎన్నికల కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన శ్రీగణేష్ తన క్యాంపు ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కంటోన్మెంట్ నియోజకవర్గంకు రావడంతో,శ్రీగణేష్ స్పీకర్ ను శాలువాతో సత్కరించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి గడ్డం ప్రసాద్ సహకారం అందించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. స్థానిక నియోజకవర్గంలో నిర్వహించిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# హరిహర క్షేత్రం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే రాక



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** యాచారం మండలంలోని చౌదర్ పల్లి గ్రామంలో శ్రీశ్రీ హరి హర దివ్య క్షేత్రం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి మూడు రోజులపాటు జరగనున్న నేపథ్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హాజరవనున్నారని డీసీసీ అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే రానున్న సందర్భంగా జిల్లా, బ్లాక్, మండల, మున్సిపాలిటీ ల నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని ఆయన కోరారు.



# సెల్ ఫోన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి రిమాండ్

**సికింద్రాబాద్, విశాలభారతి:** సెల్ ఫోన్స్ స్నాచింగ్ కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఈస్టోజోన్ డీసీపీ గిరిధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడించారు. నార్త్ లాలగూడా ఇందిరనగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సోహెల్ (19) విద్యార్థి, మిర్జాల గూడ కు చెందిన మహ్మద్ మెహబూబ్(19) విద్యార్థి అయితే, స్నేహితులైన వీరిద్దరూ ఈ నెల 23న, మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో విజయపురి కాలనీలోని మీసేవా వద్ద సురేష్ అనే కొరయర్ బాయ్ ఫోన్ మాట్లాడుతుండగా అతని వద్దకు వెళ్లి చేతిలో నుంచి ఫోన్ లాక్కొని పరారయ్యారు. దీంతో వెంటనే అతను స్థానిక లాలాగూడ పోలీసే స్టేషన్ ను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరు సెల్ ఫోన్ స్నాచర్ల తో పాటు దొంగిలించిన ఫోన్లను కొనుగోలు చేస్తున్న జగదీష్ మార్కెట్కు చెందిన షకీల్ ఖాన్ అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఒక సెల్ ఫోన్ ఒక బజాజ్ ప్లాటినా బైక్ ను స్వాధీనం చేసుకున్నారు.



# నెహ్రూకు నీలం మధు నివాళి

**పటాన్ చెరు,విశాలభారతి:** దేశానికి నెహ్రూ చేసిన సేవలు అన్ని నిర్వచనీయమని మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని ఎన్ఎంఆర్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ ఉద్యమానికి ప్రధాన నాయకుడిగా దేశానికి నెహ్రూ చేసిన సేవలు అమోఘం అన్నారు. 16 సంవత్సరాల పాటు ప్రధానిగా పని చేసి నెహ్రూ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపారని తెలిపారు. ఈయన ఒక భారతీయ వలసవాద జాతీయ వ్యతిరేక వాదని ఆయన కొనియాడారు. రాజా నీతిజ్ఞుడు లౌకిక మానవతావాది సామాజిక ప్రజాస్వామ్యవాదిగా రచయితగా సేవలందించారని తెలిపారు.



# ఓటు హక్కు వినియోగించుకున్న తీగల దంపతులు

**నూతనకల్, విశాలభారతి:** నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ఆయన సతీమణి మాజీ సర్పంచ్ శ్రీమతి కరుణశ్రీ తో కలిసి మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలి



**వనపర్తి విశాల భారతి** యువత మాదక ద్రవ్యాల వినియోగం, చెడు అలవాట్లు నుండి దూరం ఉండే విధంగా కళాశాలలు ప్రారంభం అయ్యే నాటి నుండి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం ఐ.డి. ఓ సి కాన్ఫరెన్స్ హాల్లో జూమ్ మీటింగ్ ద్వారా మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందని, అడ్మిషన్లు పూర్తి అయిన వెంటనే కళాశాలల విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే దుష్పరిణామాల పై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకు ఒక ప్రత్యేక నోడల్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా తగు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, తహసిల్దార్ కిషన్ నాయక్, జూమ్ ద్వారా అదనపు ఎస్పీ రామదాసు తేజావత్ ఆర్డీఓ పద్మావతి, డ్రగ్ ఇన్స్పెక్టర్ తసీతారులు పాల్గొన్నారు.



# సాయిప్రియ కాలనీలో విద్యుత్ అంతరాయం

- స్పందించిన కార్పొరేటర్ శారద ఈశ్వర్ రెడ్డి

**మేడిపల్లి,విశాలభారతి:** రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని సాయి ప్రియ కాలనీలో ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు కలగకుండా చూడాలని సాయి ప్రియ కాలనీ పెద్దమ్మతల్లి గణేష్ ఉత్సవ సొసైటీ అధ్యక్షులు ఆకుల కమలాకర్,జనరల్ సెక్రెటరీ మంద వెంకట రెడ్డి విద్యుత్ అధికారిని కోరారు.నిన్న రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా కాలనీలో చెట్ల కొమ్మలు విరిగడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడింది.సమస్యను కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ శారదఈశ్వర్ రెడ్డి,విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.విద్యుత్ డి.ఈ.,కార్పొరేటర్ స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించారు.రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.




# పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలి

**వనపర్తి విశాల భారతి:** వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్లో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ...ఉపాధి హామీ పనులకు సంబంధించి లేబర్ టర్న్ అవుట్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు ఉదయం 8 గంటలలోపు క్షేత్ర స్థాయికి వెళ్లి పనులను పరిశీలన చేయాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సిబ్బంది అందరూ సమన్వయం తో పని చేయాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న నరేగా పనులతో పాటు, అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాలకు సంబంధించి జాబితా తయారు చేసి డీఆర్డీఓ కు సమర్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే నిర్మాణం పూర్తి అయిన సెగ్రిగేషన్ షెడ్ లను ఉపయోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి యావరేజ్ వేజ్ రేట్, లేబర్ టర్న్ అవుట్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఇంచార్జి డిఆర్డిఓ నాగేంద్రం, జడ్పీ సీఈఓ యాదయ్య, డిప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు హాజరయ్యారు.

## రైతులకు సరిపడా జీలుగ విత్తనాలు పంపిణి

■ గీకురు రవీందర్



**చిగురుమామిడి, విశాల భారతి:** చిగురుమామిడి మండలంలో రైతులందరికి సరిపడా జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంటాయని జెడ్పి ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ తెలిపారు. చిగురుమామిడి మండల కేంద్రంలో పత్రికా సమావేశంలో స్థానిక జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ రైతులకు జీలుగ విత్తనాల కొరత ఉందని వార్తలు వస్తున్న సందర్భంగా, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి రంజిత్ రెడ్డితో ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటికీ 80 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు సరఫరా అయ్యాయని, రెండు రోజుల్లో మరో 50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వస్తాయని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులందరికీ సరిపడా విత్తనాలను వ్యవసాయ అధికారులు సబ్సిడీ మీద పంపిణి చేస్తారన్నారు. అంతేగాక వ్యవసాయ అధికారులు పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు శిక్షణ కార్యక్రమంలో ఉన్నారని, త్వరలోనే మండలంలోని అన్ని క్లస్టర్లలో ఈ ఖరీఫ్ సీజన్ కి సంబంధించి రైతులకు అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేస్తారన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిదే విజయం

■ డోర్నకల్ లో రాకేష్ రెడ్డికి మెజార్టీ ఇస్తాం
■ మాజీ గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు



**మరిపెడ,విశాలభారతి:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు ఖాయమని జిల్లా లైబ్రరీ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు అన్నారు. సోమవారం ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాల వ్యాప్తంగా, పట్టభద్రులు, నిరుద్యోగులు, మేధావులు రాకేష్ రెడ్డి వైపే మొగ్గు చూపారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నిజ స్వరూపాన్ని అర్థం చేసుకున్న మేధావులు ఉన్నత విద్యావంతుడైన రాకేష్ రెడ్డికి ఓటేసారని తెలిపారు.మొదటి ప్రాధాన్యత ఓట్ల తోనే అధిక మెజారిటీ తో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు తథ్యమని జోస్యం తెలిపారు. తెలంగాణలో సంక్షేమం కేసిఆర్ నాయకత్వంలోనే సాధ్యమని స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సింధూర,ఎంపీపీ అరుణ రాంబాబు,జెడ్పీటీసీ శారద రవీందర్,రామడుగు అచ్చుత రావు,కుడితి మహేందర్ రెడ్డి, గుగులోతు వెంకన్న,గంట్ల మహిపాల్ రెడ్డి, అజ్మీరా రెడ్డి,కౌన్సిలర్ల హతీరాం, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**మరిపెడ, విశాలభారతి:** మండలంలోని మూల మరితండ వాసి పాలేరు వాగు నుండి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను కానిస్టేబుల్ పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్టు ఎస్సై తహర్ బాబా తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు తప్పవని తెలిపారు.



## వనపర్తి నేలపై అడుగెట్టిన నెహ్రూని మరువలేని ప్రజానీకం

■ ఎమ్మెల్యే తుడి మేఘ రెడ్డి

**వనపర్తి విశాల భారతి:** భారతదేశ మొట్టమొదటి ప్రధాని దివంగత నేత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వనపర్తి నేలపై అడుగుపెట్టిన వేళా విశేషంగా ఈ ప్రాంత ప్రజలకు మరువలేని ఘట్టమని ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి అన్నారు. నెహ్రు 60వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని నంది హిల్స్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పుష్పాంజలు ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. నెహ్రు బహు ప్రజ్ఞశాలి, రాజనీతిజ్ఞుడు, సామాజిక నేత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని కొనియాడారు. 1959 అక్టోబర్ 11న మొట్ట మొదటిసారి వనపర్తి నేలపై అడుగుపెట్టాడని, ప్రధాని చేతిలో మీదగా వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, మున్సిపాలిటీ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



## మాతృమూర్తి శోకం తీరని లోటు

■ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి విశాల భారతి:** మాతృమూర్తి మానవ సృష్టికి సంజీవని లాంటిదని, అమ్మ లేనిది తీరని లోటు అని ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలం చిన్న మందడి గ్రామ మాజీ సర్పంచ్ సూర్యచంద్రారెడ్డి మాతృమూర్తి లక్ష్మీ దేవమ్మ మృతి చెందడంతో ఆమె పార్థివ దేహాన్ని కి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పెద్దమందడి మండల ఎంపీపీ రాఘుప్రసాద్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.



## జాతీయ ఛైర్మన్ ఆదేశాల మేరకు జిల్లా ప్రభుత్వాసుపత్రి సందర్శన

■ ఎస్ జెడబ్ల్యూ హెచ్ ఆర్ సి ప్రతినిధులు

**ఆర్మూర్, విశాల భారతి** రోగులకు కుళ్ళిన గుడ్లు, పురుగుల అన్నం ఉండడంతో సోమవారం ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి. ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కమిటీ జిల్లా ఆసుపత్రిని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ దత్తద్రి గౌడ్, జిల్లా ఛైర్మెన్ డా. బి. సుధాకర్ మాట్లాడుతూ జాతీయ ఛైర్మెన్ డా. కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు వంటశాలను, వంట సామాగ్రిని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ పరిశీలనలో అన్ని పరిశుభ్రంగా ఉండడంతో రోగుల దగ్గరికి వెళ్లి భోజనం ఏ విధంగా ఇస్తున్నారని వారిని తెలుసుకోవడం జరిగిందన్నారు. సమయానికి రుచికరమైన భోజనం ఇస్తున్నారని, రోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా చైర్మన్ సుధాకర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బట్టి దత్తాద్రి గౌడ్, పట్టణ చైర్మన్ నలం రామా గౌడ్, జిల్లా వైస్ చైర్మన్ రాజు, చందు కన్వీనర్ నరేష్ జక్రంపల్లి మండల ఎడ్యుకేషన్ చైర్మన్ కొప్పు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## వేసవిలో చేసే పనులపై అవగాహన

**సైదాపూర్, విశాల భారతి** గ్రామ రైతులకు డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ బిసిఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని సోమరం గర్రెపల్లి బూడిదపల్లి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమన్వయ కర్త ఎడ్ల సోనీ మాట్లాడుతూ రైతులు వేసవిలో తప్పకుండ భూసార (మట్టి ) పరీక్షలు చేయించుకోవాలని, వాటిలో వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని, దీని వల్ల ఎరువుల వినియోగం అవసరం ఉన్నంత వరకే వాడడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గి నేల కాలుష్యం తగ్గుతుందన్నారు. రైతులు వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలనీ, పశువుల పెంటలు, చెరువు మట్టి వేసుకోవాలని, గొర్ల మందలు పెట్టించు కోవాలని,పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము, పిల్లిపెసర, నవధాన్యాలు మొదలగునవి చల్లుకొని పూత దశలో వాటిని కలియ దున్నుకోవాలని, పత్తి, మొక్కజొన్న వ్యర్థాలను కలియ దున్నడం వలన జీవన ఎరువులు, వర్మీకంపోస్ట్, వెస్ట్ డికంపోజర్ వాడడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు. భూసార పరీక్షల కొరకు రైతులు తీసుకవచ్చిన మట్టిని రైతుల సమక్షంలో పరీక్షలు చేసి రైతులందరికి పరీక్షల ఫలితాలు వెంటనే ఇచ్చి అన్ని వివరాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు



## గొప్ప త్యాగశీలి జవహర్ లాల్ నెహ్రూ

■ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి విశాల భారతి:** గొప్ప త్యాగశీలి, సామాజిక అసమానతలపై, స్వాతంత్ర సమరయోధుడు, రాజనీతజ్ఞుడు జవహర్ లాల్ నెహ్రూ అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ఏఐసీసీ కార్యదర్శి జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నెహ్రు వర్ధంతినీ ఘనంగా నిర్వహించారు. వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేదరికంలో ఉన్న నిరక్షరాస్యత, సామాజిక న్యాయం, అసమానతలు పోవాలని ఎన్నో సంస్థలను సమన్వయం చేసి ప్రజల్లో చైతన్యం కోసం కృషి చేశారని గుర్తు చేశారు. వనపర్తికి నెహ్రూతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్రం కోసం ఎన్నోసార్లు జైలు పాలయ్యారన్నారు. బ్రిటిష్ కబంధహస్తాల్లో ఉన్న దేశాన్ని విముక్తి చేసిన నాయకుడని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ వర్క్ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కిరణ్ కుమార్, వెంకట్ నారాయణ, పెంటన్న యాదవ్, దివాకర్ యాదవ్, వేనాచారి, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట జిల్లాలో 73.15 శాతం పోలింగ్

■ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ
■ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల పారదర్శకంగా చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని డివిజన్లలో ఎన్నికల నిర్వహణలో భాగంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 71 కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిగిందని తెలిపారు. జిల్లాలో జరిగిన ఓట్ల వివరాలు మొదటి రౌండ్ లో పురుష ఓట్లు 4258, మహిళ ఓట్లు 1570 పోల్ కాగా 11.32 శాతం నమోదు , రెండో రౌండ్ లో పురుష ఓట్లు 10813, మహిళ ఓట్లు 5290 పోల్ కాగా 31.27 శాతం నమోదు, మూడో రౌండ్ లో పురుష ఓట్లు 17968, మహిళల ఓట్లు 9220 పోల్ కాగా 52.80 శాతం నమోదు , 4వ రౌండ్ లో పురుష ఓట్లు 24142, మహిళ ఓట్లు 12225 పోల్ కాగా 70.62 శాతం నమోదు, అలాగే జిల్లాలో పురుషుల ఓట్లు 25447, మహిళల ఓట్లు 12222 మొత్తం 37,669 పోల్ కాగా 73.15 శాతం ఓటింగ్ నమోదు అయ్యిందని కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ తదుపరి ఆయా నియోజక వర్గాల పరిధి లోని గల పోలింగ్ కేంద్రాల నుండి పోలింగ్ బాక్సులను సంబంధిత ఏ.ఆర్.ఓ ల ఆధ్వర్యంలో సెక్టార్ అధికారులు సమక్షంలో పటిష్ఠ భద్రత నడుమ 16 రూట్ల వాహనాల ద్వారా కలెక్టరేట్ లోని ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి తదుపరి నల్గొండ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్ లలో పోలింగ్ బాక్సులను భద్ర పర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పట్టభద్రుల ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి ఈ సందర్భంగా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక, అదనపు యస్.పి నాగేశ్వర రావు, ఆర్.డి.ఓ వేణుమాధవ్, తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు ఆదర్శం రమాబాయి అంబేద్కర్

**వనపర్తి విశాల భారతి:** జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో టీజేఏసీ ఆధ్వర్యంలో మహాసాధ్వి రమాబాయి అంబేద్కర్ 89 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాష్ మాట్లాడుతూ ..నవభారత రాజ్యాంగ నిర్మాత పేదల పెన్నిధి ప్రపంచ మేధావి భారత సమాజ ధర్మాన్ని ప్రశ్నించి నిలదీసి సమధర్మం సమన్యాయం ఏర్పాటుచేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అర్ధాంగి రమాబాయి అంబేద్కర్. మహాసాధ్వి త్యాగశీలి మాత రమాబాయి ధైర్య సాహసంతో సహనం కోల్పోకుండా కష్టకాలంలో అంబేద్కర్ మహనీయునికి తాను కష్టపడి పనిచేసి వచ్చిన డబ్బుతో విదేశాల్లో ఉన్నత విద్యను చదువుకోడానికి అంబేద్కర్ కు సహాయసహకారాలు అందించిన మానవతా మూర్తి ఈ తరం మహిళలకు స్ఫూర్తి ప్రదాత రమాబాయి అంబేద్కర్ అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ మహనీయుడు ప్రపంచ మేధావి కావడానికి రమాబాయి అంబేద్కర్ కృషి శ్రమ పట్టుదల ఎంతో ఉంది. ఈ కార్యక్రమంలో కవి పండితుడు బూరోజు గిరిరాజ చారి, జిల్లా ఎస్ఎస్టి మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## హత్య కేసును ఛేదించిన పోలీసులు

■ నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా సరే చట్టపరంగా చర్యలు

**సూర్యాపేట, విశాలభారతి**: నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. ఈ నెల 23న సూర్యాపేటలో యువకుడిని కిడ్నాప్ చేసి హత్య చేసిన నిందితుల వివరాలను జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు ఎస్పీ నాగేశ్వర రావు తో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో కేసుకు సంబందించిన వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన వెంకటేష్ ప్రైవేటు హౌసింగ్ లోన్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. కాగా 2022 లో తన స్నేహితుడైన బెజవాడ రాజశేఖర్ తో నెలకొన్న డబ్బుల పంచాయితీ విషయంలో అతన్ని హతమార్చాడు. తదనంతరం అతని కుటుంబ సభ్యులతో ప్రాణహాని ఉందని తలంచిన వెంకటేష్ సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామంలోని తన పెద్దమ్మ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. రాజశేఖర్ హత్యకు ప్రతీకారంగా వెంకటేష్ ని హత్య చేయుటకు అతని సోదరులు, స్నేహితులు బెజవాడ రమేష్, ఖమ్మంపాటి సైదులు, రమేష్, బెజవాడ జానయ్య, బోడ సతీష్,ఇస్లావత్ సురేష్ లు ఈనెల 23న తెల్లవారుజామున టిఎస్ 12 ఈసీ 6648 గల వాహనంలో వెంకటేష్ ని వెంబడించి సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో గల రాజుగారి తోట హోటల్ ఎదురుగా అతని ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టారు. దీంతో కిందపడ్డ వెంకన్నని బలవంతంగా తమ వాహనంలోకి ఎక్కించుకొని తమ వెంట తెచ్చుకున్న తాడుతో మెడకు చుట్టి హత్య చేశారు.



## బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం

■ మాజీ మంత్రి గుంటకండ్ల

**చిట్యాల, విశాలభారతి:** వరంగల్,ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపు ఖాయమని మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల జడ్పీ హైస్కూల్లో ఉన్న పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ సరళిని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నల్లగొండ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి లు ఎన్ని కుట్రలు చేసినా పట్టభద్రులు బిఆర్ఎస్ అభ్యర్థికే పట్టం కడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ ఆది మల్లయ్య, పిఏసిఎస్ వైస్ చైర్మన్ మెండే సైదులు, కొలను వెంకటేష్ గౌడ్,ఆవుల ఐలయ్య, గోధుమగడ్డ జలంధర్ రెడ్డి, పొన్నం లక్ష్మయ్య, కందాటి రమేష్ రెడ్డి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉర పండుగ

**ఆర్మూర్, విశాల భారతి** నందిపేట మండలంలోని లక్కంపల్లి గ్రామంలో సోమవారం ఊర పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటను సమృద్ధిగా పండాలని గ్రామదేవతలను మొక్కుకున్నారు. ఊర పండుగలో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సౌదా గారి సాగర్, సతీష్ ,అరవింద్, రామ్ లక్ష్మణ్, ముత్తెన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్.. గేదే దుర్మరణం

**మరిపెడ, విశాలభారతి:** మండలంలోని విద్యుత్తుఘాతానికి గురై సూడి గేదే దుర్మరణం చెందిన సంఘటన మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం గాలి వారి గూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. సూడి గేద యజమాని చలమల్ల నరసింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేతకు వెళ్లి 63కేవీ ట్రాన్స్ఫార్మర్ వ్యవసాయ భూమి ప్రక్కన తక్కువ ఎత్తులో వుండడం వలన ట్రాన్స్ఫార్మర్ తీగలు కిందకి ఉండడంతో షాక్ గురై మృతి చెందినట్లుగా యజమాని వాపోయాడు. గేదె విలువ దాదాపు రూ. 50,000 ఉన్నట్లు అంచానా, తనకు తగిన న్యాయం చేయాలని విద్యుత్ శాఖ వారిని రైతు కోరారు.

## జిల్లా అధ్యక్షురాలుగా పలక ఆదిలక్ష్మి



**భద్రాచలం, విశాలభారతి:** మహా జన సమితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా జిల్లా అధ్యక్షులుగా నూతనంగా పలక ఆదిలక్ష్మి నియమించడం జరిగిందని మహాజన సమితి ఆదివాసి మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులుపలక ఆదిలక్ష్మి మాట్లాడుతూ నామీద నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవిని ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కాలంలోమారుతీ నర్సింగ్ కాలేజీలో కారుణ్య దారుణ హత్యకు గురికాబడిందని ఆమె ఎలా మరణించిందో ఉన్నత అధికారులు నెక్స్ట్ పక్షపాతంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తును ప్రారంభించాలని ఆమె డిమాండ్ చేశారు కాలేజీ యాజమాన్యం మహిళా హాస్టల్స్ లో కనీస వస్తులేకుండా నిర్వహిస్తున్నారని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మారుతి నర్సింగ్ కాలేజ్ ని సీజ్ చేయాలని ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని కొత్తగా విద్యార్థులను జాయిన్ చేయనీకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు కారుణ్య హత్య పట్ల నిర్లక్ష్యం చేయ వద్దని ఏం జరిగిందో అనువణువు మహిళా లోకానికి చెప్పే బాధ్యత అధికారుల పైన ఉన్నదని ఆమె అన్నారు.

## హోటల్స్ లో ఆకస్మిక తనిఖీలు



**భద్రాచలం,విశాలభారతి:** రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఫుడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా శ్రీ భద్ర గ్రాండ్ హోటల్, శ్రీ గౌతమి స్పైస్ హోటల్ , శ్రీ రాఘవేంద్ర టిఫిన్ అండ్ మీల్స్ హోటల్ పై ఫుడ్ సేఫ్టీ బృందాలు, వి జ్యోతిర్మయి జోనల్ అధికారిణి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా శ్రీ భద్ర హోటల్ నందు రిఫ్రిజిరేటర్ లో ఉంచిన 88 లీటర్స్ ఐస్ క్రీం ఫంగస్, పురుగులతో దుర్వాసన రావడంతో జోనల్ ఫుడ్ సేఫ్టీ అధికారిణి జ్యోతిర్మయి హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అప్పటికప్పుడే ప్రజల ఆరోగ్యానికి భంగం కలవకూడదని 36 వేల విలువచేసే బూజు, పురుగులు పట్టిన ఐస్ క్రీమ్ని ధ్వంసం చేసి నోటీసులు జారీ చేశారు. క్యాన్సర్ కారకాలైన కృత్రిమ హానికరమైన రంగులను బిర్యానీ తదితర ఆహార పదార్థాలలో కలిపి, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేసి అమ్ముతు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న సదరు హోటల్ యాజమాన్యంకు FSSA చట్టానికి సంబంధించిన నోటీసులను జారీ చేసి, సుమారు 10 కేజీల రంగు కలిపిన బిర్యానిని ధ్వంసం చేసి గ్రామపంచాయతీ కార్యాలయం వారిచే పదివేల రూపాయల జరిమానా విధించి రెక్టిఫికేషన్ కోసం హోటల్ మూసి వేశారు.



## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మాజీ మంత్రి

**కోదాడ, విశాలభారతి:** కోదాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తో కలిసి సందర్శించారు. పట్టభద్రులు, కార్యకర్తలతో మాట్లాడి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. ఓటింగ్ సరళిని స్థానిక పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కోదాడ పట్టణ మాజీ అధ్యక్షులు కుక్కడపు బాబు, మునగాల మండల అధ్యక్షులు తొగరు రమేష్, రామినేని శ్రీనివాసరావు, సాదిక్, అబ్బు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## సౌడమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి

**సూర్యాపేట, విశాలభారతి:** సౌడమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట మండలంలోని టేకుమట్ల గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ సౌడమ్మ తల్లి జాతర ప్రారంభం కాగా సౌడమ్మ తల్లిని దర్శించుకొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఆనాదిగా వస్తున్న ఆచార, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, సౌడమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు యాదవ సోదరులతో కలిసి బేరిల చప్పులతో సందడి చేశారు. అదే విధంగా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో రమేష్ రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గట్టు శ్రీనివాస్, ఎడ్ల వీరమల్లు యాదవ్, దరావత్ వెంకన్న నాయక్, షఫీ ఉల్లా, దేవేందర్, పారుక్, యాట ఉపేందర్, ధర్మా, కరుణాకర్ రెడ్డి, మండల్ రెడ్డి వేణు గోపాల్ రెడ్డి, యాదవ సంఘ నాయకులు జాల మాణిక్యం యాదవ్, జాల జానయ్య యాదవ్, బొర్రాజు నాగయ్య యాదవ్, జాల శంకర్ యాదవ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు

**పాలకీడు, విశాలభారతి:** మండల కేంద్రంలో జరిగిన నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల్లో 78 శాతం యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పాలకీడు మండలం లో మొత్తం 878 ఓట్లకు గాను, 659 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 482 మంది పురుషులు, 177 మంది స్త్రీలు ఓట్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. లైన్లో ఉన్నవారికి ఓటు వెయ్యడానికి అధికారులు ఛాన్స్ ఇచ్చారు. ఇట్టి ఎన్నికలో చిన్నపాటి ఘర్షణ తప్ప, ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఓట్లు వేసేలా అధికారులు పోలింగ్ నిర్వహించారు.





# మల్లికార్జున స్వామికి నీలం మధు పూజలు

- **కొత్తపల్లిలో ఘనంగా మల్లికార్జున స్వామి జాతర**

**పటాన్ చెరు,విశాలభారతి:** శ్రీశ్రీశ్రీ భ్రమరాంబీకా మల్లికార్జున స్వామి అందరినీ సుఖ సంతోషాలతో చూడాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అందరూ బాగుండాలని వారిలో నేను కూడా ఉండాలని కోరుకునే నాలాంటి వ్యక్తినీ మీరు ఆదరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు,గ్రామ గ్రామాన కాంగ్రెస్ ను ఆదరించి బలపరిచారని జూన్ 4వ తేదీన జరిగే లెక్కింపులో కాంగ్రెస్ మంచి మెజారిటీతో గెలుపొందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు నర్సింగ్ రావు, మాజీ వైస్ ఎంపీపీ వీర రెడ్డి, నరేందర్ రెడ్డి, అలేటి నవీనశ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, తిరుమలవస్, మల్లేష్, గోపాల్, శ్రీనివాస్, సురేష్, మహేష్, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

**మరిపెడ,విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గ మరిపెడ మండల పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పురుషుల ఓట్లు 15850 కాగా మహిళలవి 8435 ఓట్లు. ఇందులో మొత్తం 24285 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు ఉత్సాహం కనబరిచారు. మరిపెడ పట్టణంలోని ప్రముఖులు, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ దంపతులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ,మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరిపెడ పట్టణ సిఐ హతిరామ్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్సై తహేర్ బాబా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధితో కేంద్రాల వద్ద ఓటర్లు గుమికూడకుండా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు సెల్ ఫోన్లు అనుమతించకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద టీచర్లు, యువత అధిక సంఖ్యలో పట్టభద్రులు పాల్గొనీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.





# పిచ్చి కుక్క దాడి

- **20 మందికి గాయాలు**
- **భయపడుతున్న తెల్లాపూర్ ప్రజలు**

**పటాన్ చెరు(రామచంద్రాపురం),విశాల భారతి:** రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ లో ఓ పిచ్చి కుక్క 20 మందిని కరిసి బీభత్సం సృష్టించింది. ఇళ్ల లోంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఆదివారం రాత్రి రోడ్డుపై ఉన్న ఓ వృద్ధున్ని పిచ్చికుక్క కరిచింది. అక్కడ నుంచి పలు వీధుల్లో చిన్నారులను, వృద్ధులను కరుచుకుంటూ స్వైర విహారం చేసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు సుమారు 20 మందిని పిచ్చికుక్క కరిచింది. బాధితులు శేరిలింగంపల్లి, కొండాపూర్ లోని ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందారు. పిచ్చికుక్క భయానికి గ్రామస్తులు బయటికి వెళ్లాలంటే కర్రలను తీసుకొని వెళుతున్నారు. అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో పిచ్చి కుక్క కాటు బాధితుల సంఖ్య 20కి చేరుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యం

**కోదాడ, విశాలభారతి:** నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యమని వ్యవసాయ సామాజిక కార్యకర్త మొలుగూరి గోపయ్య తెలిపారు. సోమవారం అనంతగిరి మండలం కొత్తగూడెం, గోండ్రియాల, లక్కవరం, శాంతినగర్, మొగలాయికోట, కిష్టాపురం, పాలారం, పాలారం తండా, చనుపల్లి, త్రిపురవరం, వసంతపురం, వాయిలసింగారం గ్రామాలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంగా స్వచ్ఛందంగా నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై రైతు చైతన్య యాత్ర కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతి రైతు తమ కుటుంబ ఆరోగ్యం కోసం ఎలాంటి రసాయన మందులను ఉపయోగించకుండా మనకు అందుబాటులో లభించే సహజ వనరులతో సాగు చేపట్టాలన్నారు. పశువుల పెంట, చెరువు మట్టి, జీవామృతం, ఘన జీవామృతం నేలకు వాడితే భూసారం పెరుగుందన్నారు. దీంతో ఆరోగ్యవంతమైన పంట వస్తుందన్నారు. చీడ, పీడల నివారణకు నీమస్త్రం, వేప గింజలు, వేప ఆకులు, వావిలాకు, తుటికాడ, ఆవు మూత్రము, పుల్లటి మజ్జిగతో పాటు ఆకుల ద్రావణాలు వాడవచన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## ఓటుహక్కు వినియోగించుకున్న జాజుల

- **కుటుంబమంతా పట్టభద్రులే**

**నకిరేకల్ ,విశాలభారతి:** వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సామాజిక విశ్లేషకులు జాజుల దినేష్, గొరెంకలపల్లి మాజీ సర్పంచ్ జాజుల నాగయ్యల కుటుంబం అంత పట్టభద్రులే అందరూ కలిసి నకిరేకల్ పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం వేసే ఓటు భావి తరాల అభ్యున్నతికి దోహదం చేసే విధంగా ఉండాలని కోరారు. పట్టభద్రులు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులు అందరూ పట్టభద్రుల ఓటు హక్కు కలిగి ఉండటం విశేషం.



## నర్సరీలను సంరక్షించాలి

- **జెడ్పి సీఈఓ - కృష్ణా రెడ్డి**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** నర్సరీలను సంరక్షించుకుంటూ ఎప్పటికప్పుడు నీటిని అందించాలని జడ్పీ సీఈవో కృష్ణా రెడ్డి తెలిపారు. సోమవారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో అధికారులతో నర్సరీ, వైకుంఠధామం, కంపోస్ట్ యార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో , ఎంపీడీవో నరేందర్, ఎంపీవో ఉమరాణీ, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.....



## పోగొట్టుకున్న ఫోన్లు లభ్యం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** సెల్ఫోన్లు దొంగతనానికి గురైనా, పోగొట్టుకున్నా బాధితులు సెంట్రలైజ్డ్ ఎక్విప్మెంట్ ఐడెంటిఫికేషన్ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే త్వరగా ఫోన్లు గుర్తించి బాధితులకు అప్పగిస్తామని ఇబ్రహీంపట్నం ఏసిపి కే.పి.వి రాజు తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా 18 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఆయన వెల్లడించారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు అపరిచితుల నుంచి సెకండ్హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు పూర్తి జాగ్రత్తలు పాటించాలని, అనుమానం ఉంటే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాధితులందరికి ఫోన్లను ఏసిపి అందజేశారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ , ఎస్ఐ మారయ్య , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణ దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి:** పంజాబ్ రాష్ట్రంలోని అమృత్ సర్ లో గల సిక్కుల ఆధ్యాత్మిక క్షేత్రం స్వర్ణ దేవాలయాన్ని సోమవారం పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, అమీన్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, పాండు, మాణిక్ ప్రభు, రాజు, తదితరులు పర్యటనలో ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# సినిమా

www.vishalabharati.com
epaper:vishalabharati.com

vishalabharathi Telugu Daily



## డిస్నీ + హాట్‌స్టార్‌లో 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్'



బాహుబలి మరియు మాహిష్మతి ప్రపంచంలో వినని, చూడని మరియు సాక్ష్యం లేని అనేక సంఘటనలు మరియు కథలు ఉన్నాయి. డిస్నీ + హాట్‌స్టార్ మరియు గ్రాఫిక్ ఇండియా ఇటీవల భారతదేశంలోని అభిమానుల అభిమాన చిత్ర ఫ్రాంచైజీలలో ఒకటైన హాట్‌స్టార్ స్పెషల్స్ 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్', ఇది మహిష్మతి యొక్క గొప్ప రాజ్యాన్ని మరియు సింహాసనాన్ని రహస్య యుద్ధవీరుడు రక్త దేవ నుండి రక్షించడానికి బాహుబలి మరియు భల్లాలదేవ చేతులు కలిపిన కథ యొక్క యానిమేటెడ్ సిరీస్‌ను ప్రారంభించింది. గ్రాఫిక్ ఇండియా మరియు ఆర్కా మీడియావర్క్స్ ప్రొడక్షన్, బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్‌ను గొప్ప దార్శనికుడు S.S. రాజమౌళి, శరద్ దేవరాజన్ & శోబు యార్లగడ్డ నిర్మించగా, జీవన్ J. కాంగ్ & నవీన్ జాన్ దర్శకత్వం వహించడంతో పాటు, నిర్మాతలుగా వ్యవహరించారు. డబ్బింగ్ ఆర్టిస్ట్ సామర్లకోట సాయిరాజ్ ఇలా అన్నారు, "ఇది కొంచెం ఛాలెంజింగ్‌గా ఉంది. అలాంటి ఐకానిక్ వాయిస్ మరియు పర్సనాలిటీని మ్యాచింగ్ చేయడం ఒక టాస్క్‌గా ఉంది. ఆ పాత్ర కోసం ప్రేక్షకుల నుండి ఇప్పటికే ఒక నిరీక్షణ ఉంది, కాబట్టి నేను నింపడానికి పెద్ద బూట్లు ఉన్నట్లు అనిపించింది. ఎంపిక కావడం నన్ను ప్రేరేపించింది. ఈ సిరీస్ మరియు పాత్రతో నేను మరింత సౌకర్యవంతంగా ఉండటంతో, నేను నా వాయిస్‌ని మార్చుకుని పాత్రలోకి దిగిపోయాను. నాకు సహకరించిన డబ్బింగ్ దర్శకుల వల్ల కథలో ఇన్వాల్వ్ అయ్యాను. సౌండ్ ఇంజనీర్‌తో మంచి డైనమిక్‌ని కలిగి ఉండటం వల్ల టేక్‌ల సమయంలో పాత్ర మరియు డైలాగ్‌ల ప్రవాహంలో మంచి పట్టు సాధించాను." బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్ ఇప్పుడు డిస్నీ+ హాట్‌స్టార్‌లో మాత్రమే ప్రసారం అవుతోంది .

## అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి"



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి". శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి సహ నిర్మాతలు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటిస్తున్నారు. ప్రముఖ స్వరకర్త యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాలతో మే 31వ తేదీన "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి" చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ కు విశేష స్పందన లభించింది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన యువ అందాల తార నేహా శెట్టి.. చిత్ర విశేషాలను పంచుకున్నారు. బుజ్జి అనేది 90లలో ధనవంతుల కుటుంబానికి చెందిన పల్లెటూరి అమ్మాయి పాత్ర. అందంగా కనిపిస్తూనే, ధృడంగా ఉండే పాత్ర ఇది. ట్రైలర్ లో గమనిస్తే మిగతా పాత్రలతో పోలిస్తే బుజ్జి పాత్ర భిన్నంగా ఉంటుంది. ట్రైలర్ లో మీకు అందంగా, సౌమ్యంగా కనిపిస్తుంది. కానీ చాలా శక్తిగల మహిళ పాత్ర ఇది. సినిమాలో ఈ పాత్రకి సంబంధించి ఆశ్చర్యకర విషయాలు ఉంటాయి. బుజ్జి అనేది సినిమాలో బలమైన పాత్రలలో ఒకటి. ఒకమ్మాయిలో ఎన్ని భావోద్వేగాలు ఉంటాయో అవన్నీ ఇందులో చూడొచ్చు. స్క్రిప్ట్ భిన్నంగా ఉంటుంది. ఒక కుటుంబ ప్రయాణం ఉంటుంది. 90 లలో రత్న అనే పాత్రతో పాటు రత్నమాల, బుజ్జి పాత్రల చుట్టూ కథ తిరుగుతుంది. ఇది ఒక జీవిత కథ. ప్రచార చిత్రాలు చూసి యాక్షన్ మాత్రమే ఎక్కువ ఉంటుంది అనుకోవద్దు. రొమాన్స్, కామెడీ, డ్రామా అన్నీ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా సినిమా ఉంటుంది. డైరెక్టర్ గారు నాకు శోభన గారిని రిఫరెన్స్ గా చూపించారు. చీరకట్టు, జుట్టు, కళ్ళ కాటుక ఇలా ప్రతి దాని మీద ఎంతో శ్రద్ధ పెట్టాము. 90ల నాటికి తగ్గట్టుగా నా ఆహార్యాన్ని మార్చుకోవడమే కాకుండా.. అప్పటి నటీమణుల అభినయం ఎలా ఉండేదో తెలుసుకొని, దానికి తగ్గట్టుగా హావభావాలు పలికించాను. నేను ఇప్పటివరకు ఎక్కువగా మోడ్రన్ పాత్రలే చేశాను. కానీ బుజ్జి పాత్ర అలా కాదు. అందుకే దానికి తగ్గట్టుగా హోంవర్క్ చేశాను. అయితే యాస విషయంలో మాత్రం నేను ఎటువంటి హోంవర్క్ చేయలేదు. ఎందుకంటే బుజ్జి అనేది ధనవంతుల అమ్మాయి పాత్ర కాబట్టి.. రత్న పాత్రలాగా మాటల్లో పెద్దగా యాస ఉండదు. పైగా మాటల కంటే ఎక్కువగా కళ్ళతోనే భావాలను పలికించే పాత్ర ఇది. ఈ బుజ్జి పాత్ర నాకు ఎంతగానో పేరు తెచ్చి పెడుతుంది. విశ్వక్ సేన్ తో కలిసి నటించడం ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. తీవ్ర ఎండలో కూడా షూట్ చేశాడు. మేము మంచి స్నేహితులయ్యాం. అందుకే ఎటువంటి సన్నివేశాల చిత్రీకరణలోనూ మేము ఇబ్బంది పడలేదు.

## జూన్ 7న రక్షణ గ్రాండ్ రిలీజ్



'Rx100', 'మంగళవారం' వంటి సినిమాలతో తనదైన గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్. ఆమె ఇప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా..పవర్‌ఫుల్ ఇన్వెస్టిగేటివ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'రక్షణ'. రోషన్, మానస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా రక్షణ చిత్రం మెప్పించనుంది. రీసెంట్‌గా విడుదలైన ఈ టీజర్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. హరిప్రియ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రణదీప్ ఠాకోర్ దర్శకత్వం వహిస్తూ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూన్ 7న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా... దర్శక నిర్మాత ప్రణదీప్ ఠాకోర్ మాట్లాడుతూ '''రక్షణ' టీజర్‌కు చాలా మంచి స్పందన వస్తుంది. ఇదొక ఓ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామా. పాయిల్ పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఒక పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన ఘటన స్ఫూర్తితో రాసిన కథతో సినిమా రూపొందింది. ఏ దశలోనూ రాజీ పడకుండా ఉన్నత నిర్మాణ విలువలతో సినిమాను తెరకెక్కించాం. ఈ సీట్ ఎడ్జ్ క్రైమ్ థ్రిల్లర్‌ను జూన్ 7న విడుదల చేస్తున్నాం'' అన్నారు.

## భజే వాయు వేగంలో ట్రెడిషనల్ అమ్మాయి క్యారెక్టర్ లో ఆకట్టుకుంటా

- హీరోయిన్ ఐశ్వర్య మీనన్



స్పై సినిమాలో స్టైలిష్ యాక్షన్ తో ఆకట్టుకున్న హీరోయిన్ ఐశ్వర్య మీనన్...అందుకు పూర్తి కాంట్రాస్ట్ క్యారెక్టర్ లో "భజే వాయు వేగం"లో కనిపించనుంది. హీరో కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ నిర్మిస్తోంది. హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషించాడు. ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ప్రశాంత్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ నెల 31న "భజే వాయు వేగం" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ సందర్భంగా సినిమా హైలైట్స్ తన ఇంటర్వ్యూలో తెలిపింది హీరోయిన్ ఐశ్వర్య మీనన్. "భజే వాయు వేగం" సినిమాలో ఇందు అనే క్యారెక్టర్ చేశాను. ఆమె బ్యూటీషియన్. బ్యూటీషియన్ అంటే సహజంగానే అందంగా ఉంటుంది. ఈ సినిమాలో హీరో పేరు వెంకట్. ఆయన పర్సెప్షన్ లోనే సినిమా అంతా వెళ్తుంది. కథలో నేను కీలకమైన పాత్రగా ఉంటాను. ఇది కమర్షియల్ సినిమా అయినా కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ అలా వచ్చి ఇలా వెళ్లినట్లు నా క్యారెక్టర్ ఉండదు. వెంకట్ కోసం ఈ అమ్మాయి ఏదైనా చేస్తుంది. అంతగా అతన్ని ఇష్టపడుతుంది. "భజే వాయు వేగం" ఒక రా కంటెంట్ మూవీ. యాక్షన్, ఎమోషన్ ఆకట్టుకుంటాయి. నాకు ఇలాంటి సబ్జెక్ట్స్ చేయడం ఇష్టం పైగా యూవీ లాంటి పెద్ద బ్యానర్ నిర్మించింది. సో ఆఫర్ వచ్చిన వెంటనే ఈ సినిమా ఒప్పుకున్నా. ఈ సినిమాలో ట్రెడిషనల్ క్యారెక్టర్ లో కనిపిస్తా. సినిమా చీరకట్టు లేదా ట్రెడిషనల్ దుస్తులు వేసుకుంటా. నాకు ఇలాంటి క్యారెక్టర్స్ చేయడం ఇష్టం ఎందుకంటే రియల్ లైఫ్ లో కూడా నాకు ట్రెడిషనల్ దుస్తులు ధరించేందుకు ఇష్టపడుతుంటా. స్పై సినిమా తర్వాత నాకు తెలుగులో ఆఫర్స్ వచ్చాయి. ఎంపికగా సినిమాలు సెలెక్ట్ చేసుకుంటా వచ్చా. తెలుగులోనే కాదు తమిళం, మలయాళంలో సినిమాలు చేస్తున్నా. తెలుగు ఇండస్ట్రీ అంటే నాకు ఇష్టం. ఇక్కడే ఎక్కువ సినిమాలు చేయాలనుకుంటున్నా. అయితే ఇతర పరిశ్రమల్లో ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్స్ వచ్చినప్పుడు నో చెప్పలేం కదా. మలయాళంలో మమ్ముట్టి గారితో మూవీ చేసే ఛాన్స్ వచ్చింది. అలాంటి లెజెండ్ తో కలిసి నటించే అవకాశం ప్రతిసారీ దక్కకపోవచ్చు.

## గ్రాండ్ గా అపర్ణ సినిమాస్ లాంచింగ్ ఈవెంట్



సక్సెస్ ఫుల్ కన్స్ట్రక్షన్ సంస్థ అపర్ణ కన్స్ట్రక్షన్స్ సినిమాస్ లోకి అడుగుపెట్టింది. ప్రేక్షకులు లార్జర్ దెన్ లైఫ్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించేలా మోడరన్ టెక్నాలజీ, అద్భుతమైన యాంబియన్స్, వరల్డ్ క్లాస్ ప్రొజెక్షన్, సౌండ్ సిస్టమ్, సిట్టింగ్, లగ్జరీ సదుపాయలతో అపర్ణ సినిమాస్ మల్టీ ప్లెక్స్ ని గ్రాండ్ గా లాంచ్ చేసింది. ఘనంగా జరిగిన ఈవెంట్ లో అపర్ణ సినిమాస్ లోగోని లాంచ్ చేశారు. అపర్ణ సినిమాస్ గ్రాండ్ లాంచ్ ఈవెంట్ లో అపర్ణ కన్స్ట్రక్షన్ & ఆపరేషన్స్ హెడ్ రామ కృష్ణ మాట్లాడుతూ.. 2010లో నల్లగండ్లలో ఏమీ వుండేది కాదు. అ రోజుల్లోనే సిటీలో అతి పెద్ద గ్రేటెడ్ కమ్యూనిటీ అపర్ణ సరోవర్ ని కట్టి ఇవ్వడం జరిగింది. ఇది నిర్మించినప్పుడే మా కస్టమర్స్ కి మల్టీ ప్లెక్స్, మాల్ రాబోతుందని చెప్పాం. ఆ ప్రామిస్ పూర్తి చేయడానికి అపర్ణ సినిమాస్ కట్టడం జరిగింది. అపర్ణ ఏది చేసినా ది బెస్ట్ గా వుంటుంది. మాల్, సినిమాస్ కూడా ది బెస్ట్. ఎన్వీ ప్రసాద్ గారి సలహాలతో అపర్ణ సినిమాస్ లోకి రావడం జరిగింది. ఎక్కడా రాజీపడకుండా అత్యద్భుతంగా మల్టిప్లెక్స్ ని కట్టాం. యాంబియన్స్. ప్రొజక్షన్, సౌండ్, సిట్టింగ్, కంట్రోల్ టెంపరేచర్, లాబీ, రెస్ట్ రూమ్స్ ఇలా అనీ ఆధునాతన టెక్నాలజీతో నిర్మించడం జరిగింది. అలాగే సినిమాతో పాటు మంచి ఫుడ్ ని కూడా ఆస్వాదించే ఏర్పాటు చేయడం జరిగింది. అపర్ణ సినిమాస్ ప్రేక్షకులు గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచుతుంది' అన్నారు నిర్మాత ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ..అపర్ణ సంస్థల ఓనర్, నేను స్నేహితులం. తను ఏదైనా ది బెస్ట్ కోరుకుంటారు. ఎక్కడా రాజీపడడు. ఈ మాల్ లో కొత్త స్పెషాలిటీ అండర్ గ్రౌండ్ లో రెండు కార్లు ఒకేసారి వెళ్ళొచ్చు, రావచ్చు. ది బెస్ట్ సౌండ్ సిస్టమ్ సిట్టింగ్ ప్రొజెక్షన్ వుంది. సినిమాతో పాటు ఫుడ్ కూడా రిజినబుల్ ధరల్లోనే వుంటాయి. అపర్ణ ప్రపంచవ్యాప్తంగా ఓ మంచి బ్రాండ్. సినిమాస్ లో ది బెస్ట్ గా వుండేలా అద్భుతంగా నిర్మించారు. మే31 నుంచి అందరికీ అందుబాటులోకి వస్తుంది. ఇది ఇండియాలోనే ఒక ప్రైడ్ మాల్ అవుతుంది. ప్రేక్షకులు గొప్ప అనుభూతితో సినిమా చూసి వెళ్తారు. అపర్ణ సంస్థ సినిమాస్ లోకి రావడం సినిమాలకి శుభపరిణామం. కొత్త బ్రాండ్ లాంచ్ అయ్యింది. భవిష్యత్ లో మరిన్ని థియేటర్స్ లో వస్తాయి. ఇండియాలోనే అపర్ణ సినిమాస్ బెస్ట్ మాల్ అవుతుందని కోరుకుంటున్నాను'' అన్నారు.

## ఆరు భాషల్లో కపుల్ సాంగ్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కన్నడ సోయగం రష్మిక మందన్నా కాంబోలో వస్తోన్న సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప.. ది రూల్. సుకుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ తెరకెక్కిస్తోంది. కాగా ఇప్పటికే ఫస్ట్ సింగిల్ పుష్ప పుష్ప సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతుండగా.. ఇటీవలే పుష్ప సెకండ్ సింగిల్ అప్‌డేట్ కూడా అందించారు. సూసేకి అగ్గిరవ్వ మాదిరే ఉంటాడే నా సామి అంటూ సాగే కపుల్ సాంగ్ రాబోతుందని తెలియజేసింది రష్మిక మందన్నా. ఈ వీడియో కూడా నెట్టింటిని షేక్ చేస్తోంది. కాగా ఈ పాట పాడింది ఎవరో కాదు.. తన మ్యాజికల్ వాయిస్‌తో మ్యూజిక్ లవర్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే పాపులర్ సింగర్ శ్రేయాఘోషల్. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో శ్రేయో ఘోషల్ పాటలకు సూపర్ క్రేజ్ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తన గాత్ర మాధుర్యంతో మాయ చేసే ఈ భామ తాజాగా మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ పుష్ప ది రూల్‌లో కపుల్ సాంగ్ పాడటంలో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. Sooseki (తెలుగు) అంటూ సాగే ఈ పాట తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాలీ భాషల్లో మే 29న విడుదల కానుందని తెలిసిందే. ఈ పాటను అన్ని భాషల్లో శ్రేయోఘోషల్ పాడటం ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. మరోసారి శ్రేయాఘోషల్ వాయిస్ అందరినీ మెస్మరైజ్ చేయడం పక్కా అయిపోయినట్టే. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్‌ను షురూ చేశారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.